KSR02B115 C

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
ఏప్రిల్ 03, 2016

స్నేహ

ముద్దుల మనవరాలు

ENTERED

మది మదిలో ఉగాది



'మేరీకోమ్'లో ప్రియాంక

'తను వెడ్స్ మను రిటర్న్స్'లో కంగన



'పా' లో అమితాబ్

డి-గ్లామర్‌తో అందం

నిన్నమొన్నటిదాకా బాలీవుడ్ తారాలకు అందం, అభినయం గుర్తింపుని తెచ్చిపెట్టేవి. నేటి బయోపిక్స్ ఫీవర్‌లో మాత్రం డిగ్లామర్ పాత్రలు నటులకు మరింత క్రేజ్ పెంచుతున్నాయి. నటనతోపాటు పాత్రలో పరకాయ ప్రవేశం చేయడమంటే అంత తేలికైన విషయమేమీ కాదు. యాక్టింగ్, మేకప్, దేహ తీరు అన్నీ సింకయితేనే ఆ క్యారెక్టర్‌కి, ఆర్టిస్ట్‌కి పేరొచ్చేది. అందుకోసం పాత్రకి తగ్గట్టు వారి దేహ తీరులోను మార్పులను చేసుకుంటున్నారు నేటి తారలు. కొందరేమో ఓపిగ్గా భారీ మేకవ్ వేయించుకుంటున్నారు. బయోపిక్‌లనే కాదు ఫాంటసీ కథల్లోను ఈ ట్రెండ్‌ను విపరీతంగా ఫాలో అవుతున్నారు. మేకప్ ఆర్టిస్ట్‌గా ఆస్కార్ అవార్డును గెలుచుకున్న విదేశీ మేకప్‌మెన్ కెనమ్‌తో పౌడర్ అద్దించుకుంటున్నారు. ప్రొగేరియా సోకిన వ్యక్తి ప్రాత్రలో అమితాబ్‌ను 'పా' సినిమాలో చూసి ప్రేక్షకులు అవాక్కయ్యారు. అంతపెద్ద కాయం వున్న అమితాబ్‌ని కుంచించుపోయినట్లు కనిపించేలా చేయడం అంత తేలికేంకాదు! క్రిస్టీన్ డిన్సలీ, డొమైన్‌టిల్ ఆ పాత్రకి కృత్రిమ రూపాన్నిచ్చేందుకు అంతలా కష్టపడ్డారు. ఇక షారుక్ 'ఫ్యాన్' కోసం డిఫరెంట్‌గా కనిపించనున్నాడు. కంగనా 'తను వెడ్స్ మను రిటర్న్స్'లో మరీ సాదాగా డిగ్లామర్ రోల్‌లో కనిపించి మెప్పించేసింది. ప్రియాంకా చోప్రా మేరీకోమ్ తర్వాత మరో చిత్రానికి మళ్లీ డిగ్లామరైజ్‌డ్ ముఖంతో ఎదురవనుంది. రణదీప్ హుడా కొత్త సినిమాలో సరబ్‌జిత్ పాత్ర కోసం 28 రోజుల్లో 18 కేజీల బరువు తగ్గి సెట్లోని వారందరినీ ఆశ్చర్యపరిచాడు. రుషికపూరేమో 'కపూర్ అండ్ సన్స్' చిత్రం కోసం బాణ పొట్టతో వెరైటీ లుక్‌తో ఆకట్టుకున్నాడు. ఇక శంకర్ విక్రమ్‌తో వేయించిన 'బీస్ట్' వెర్షన్ మేకప్ గురించి గుర్తు రాకుండా ఉంటుందా! ఇక బరువు పెరగడం మళ్లీ తగ్గడం ఇలా ఎన్ని అవస్థలు పడినా పిక్చర్ క్లారిటీ కోసమే.



'సరబ్ జిత్'లో రణదీప్ హుడా

'ఐ'లో విక్రమ్

KSR02B115

అతడో బాబా. మామూలుగా అయితే బాబాలు నోట్లోంచి లింగాలు తీస్తారు.. గాల్లోంచి నిమ్మకాయలు తెస్తారు. చిటికెలేసి విభూది భస్మం రాలుస్తారు. కాని ఈ బాబా అడవినే సృష్టించాడు. వర్షాలను రప్పించాడు. చెరువులను నీటితో నింపేశాడు. అందుకే 51 గ్రామాలకు ఆయన బాబా. ఇప్పుడు జార్ఖండ్ రాష్ట్రానికే బాబా. రెక్కల కష్టంతో తప్ప కనికట్టుతో కట్టిపడేయడీ బాబా.

ప్రకృతి యోధుడు

ENTERED

సైమన్ ఓరాన్. జార్ఖండ్ యోధుడు. ప్రకృతితోనే పోరాడి గెలిచిన వీరుడు. 85 ఏళ్ల వృద్ధుడే అయినా ఆయన జీవితంలో 60 ఏళ్లు అడవి కోసం పోరాడాడు. పెద్ద పెద్ద పర్యావరణవేత్తలు సాధించలేనిది ఒక్కడే ఒంటరిగా సాధించాడు. పర్యావరణంపై మేధావులు పుస్తకాలు రాస్తే.. సైమన్ చేసి చూపించి కొత్త చరిత్రనే రచించాడు. ఏ పర్యావరణ ఉద్యమంలోనూ పాల్గొనలేదు. కానీ తన ఊరి బాగు కోసం తనకు తెలియకుండానే భారీ పర్యావరణ ఉద్యమాన్ని విజయవంతంగా నడిపిస్తున్నాడు. ఈ పోరాటం వెనక అడవితల్లి ఆవేదన ఉంది. ఆ ఆవేదనను అర్థం చేసుకుని కొత్త చరిత్ర ఆరంభించిన సైమన్ ఓరాన్ జీవితం ఉంది.

రాంచీకి 35 కిలోమీటర్ల దూరంలో ఉంది ఖాక్సీ తోరా గ్రామం. ఒకప్పుడు దట్టమైన అడవితో పచ్చగా ఉండేది. అడవి దొంగలు ఎక్కువై.. చెట్లు కొట్టేసి.. స్మగ్లింగ్ చేయడం పెరిగిపోయింది. పెద్ద పెద్ద మిషన్లు తెచ్చి మరీ చెట్లు కొట్టేసేవారు. మొదట్లో ఈ మిషన్లను జనం వింతగా చూసేవారు. వారికప్పుడు తెలియలేదు.. ఈ మిషన్లే చెట్లతో పాటు తమ జీవితాలను కూడా నరికేస్తాయని. చెట్లు కొట్టేశారు. పడే వర్షాలు ఆగిపోయాయి. వ్యవసాయం చేయడానికి నీళ్లు లేవు. రైతు కూలీగా మారాడు. నగరాలకు వలస పోయారు. అడవే ఆస్తిగా బతికే ఆ అడవి బిడ్డలు అనాథలైపోయారు. నేలతల్లిని నమ్ముకున్న వారి జీవితాలు నేలపాలైపోయాయి. దెబ్బ తిన్న కుటుంబాల్లో ఒక కుటుంబం సైమన్ ఓరాన్‌ది.

చిన్నప్పటి నుంచే తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయం చేసేవాడు. తన కళ్ల ముందే చెట్లను కొట్టేస్తుంటే వినోదంగా చూసేవాడు. అది వినోదం కాదు విషాదమని కొన్ని సంవత్సరాలకు గాని తనకు తెలియలేదని చెబుతాడు. వ్యవసాయం లేక తండ్రి వలసపోతే.. సైమన్ కుటుంబాన్ని చూసుకునేవాడు. వర్షాలు ఎందుకు ఆగిపోయాయి.. నీళ్లు ఎందుకు లేవు అనే విషయాన్ని సైమన్ గుర్తించాడు. అడవి ఉంటేనే వర్షాలు పడతాయి.. చెట్లు నరికేశారు కాబట్టే వానలు రావడం లేదు.. ముందు అడవిని రక్షించుకుని దాన్ని పెంచాలనే నిర్ణయాన్ని తీసుకున్నాడు. ఇప్పటికిప్పుడు ఏమీ కాదు అని నీరసపడిపోలేదు. ఎప్పటికైనా జరుగుతుందనే నిశ్చయంతో బీజం వేశాడు. మొదట్లో సైమన్ ఒక్కడే కానీ.. అతడు చూపించిన బాటలో అందరూ పయనించారు.

మొక్కలను నాటడం మొదలెట్టారు. వాటిని పెంచారు. అడవిని నరకడానికి వచ్చే స్మగ్లర్లను ప్రాణాలకు తెగించి అడ్డుకున్నారు. చెట్టు మీద చేయి పడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అడవి పెరిగింది.. మళ్లీ వర్షాలు మొదలయ్యాయి. వర్షపు నీటిని నిల్వ చేసుకోవడానికి చెక్‌డ్యామ్‌లు కట్టారు. మట్టితో కట్టిన ఆ డ్యామ్‌లు ఆగలేదు. స్థానిక అధికారులు కలిసి వచ్చి డ్యామ్‌లు కట్టారు. అలా చెరువులు తయారయ్యాయి. అవి నీటితో నిండిపోయాయి. ఇదంతా ఒక్క ఏడాదిలో జరగలేదు. ఎన్నో ఏళ్లు సైమన్ ఓరన్ ఓపికగా చేసుకుంటూ వస్తే ఇప్పుడా ప్రాంతం పచ్చగా కళకళలాడుతోంది.

ఒకప్పుడు ఒక పంట కూడా లేని ప్రాంతం.. ఇప్పుడు మూడు పంటలు అది కూడా వరిపంట వేసుకుంటున్నారు. 25 వేల మెట్రిక్ టన్నుల కూరగాయలను చుట్టుపక్కల ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. సైమన్ ఓరన్ ఆచరణతో సాధించిన ఈ విజయాన్ని చూసి పర్యావరణవేత్తలే ఆశ్చర్యపోతున్నారు. ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ ఇచ్చి సత్కరించింది. అయినా ఇది తనొక్కడి విజయం కాదని.. తమ ప్రాంత ప్రజలందరి సమిష్టి విజయమని ఆయన వినయంగా చెబుతున్నాడు. జార్ఖండ్ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి కోసం నిర్వహించే వాటర్‌షెడ్ కార్యక్రమానికి సైమన్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది. పెద్ద పెద్ద సదస్సులు పెట్టి ప్రసంగాలు చేసే మేధావుల స్థానంలో ఇప్పుడు సైమన్ ప్రసంగిస్తున్నాడు.

ఎవరో ఒకరు ఎపుడో అపుడు ముందుకు అడుగేస్తారనే పాట ఉంది. అలాగే సైమన్ ధైర్యంగా ముందుకు అడుగేశాడు. ఆ అడుగులో ఇప్పుడు లక్షల అడుగులు కలిసి నడుస్తున్నాయి. పర్యావరణ ఉద్యమానికే స్ఫూర్తిదాయకంగా నిలిచిన సైమన్ ఓరన్ జీవితం ఎన్నో ప్రాంతాలకు ఆదర్శం కావాలి. అడవితల్లిని కాపాడుకుని.. పచ్చదనాన్ని పరిరక్షించుకోవాలి. లక్షలాది జీవితాలను వెలిగించటంతో పాటు.. కోట్లాది మందికి మంచి పర్యావరణాన్ని అందించాలి.

- కిరణం

కథా నిలయం



మార్గదర్శి............ 1
ప్రకృతి యోధుడు
స్టార్.................3
ముద్దుల మనవరాలు
ప్రత్యేకం.............. 4
ఏడు వింతలే..!
కార్టూన్ పంచ్......... 5
యువ.................10
కబడ్డీ కెరటం
తెలుసా................11
వజ్రపు ధగధగలు

ఇండెక్స్

మది మదిలో ఉగాది

అట్టమీది కథ.........6

నా కళ్ళతో - 12
ప్రేమ.. పెళ్ళి.. యాత్ర
వింతలోకం...............14
జికా దుస్తులట!
పరిచయం..............16
బుర్రలకో బ్యాంకు
కథ.............18
రుణ మాఫియా!
రుచి.....................21
ఉగాది పచ్చడి
బాల నేస్తాలు...............22
బంగారు నెమలి
పదవికాసం...............24

డేరింగ్ నోర్మా

అంతరించిపోతున్న పిచ్చుకల దయనీయ జీవనపోరాటాన్ని అద్దంపట్టింది అట్టమీది కథనం. కన్నయ్య అభ్యుదయ విద్యార్థిగా ఎదగడానికి పోరాట స్ఫూర్తి నింపిన తల్లి అభినందనీయురాలు. జెమినీలో కళాభవన్ మణి వెరైటీ మిమిక్రీకి కడుపుబ్బ నవ్వేవాళ్లం. 45 ఏళ్ల చిన్న వయసులోనే మరణించడం బాధించింది. అర్చన ఎంచుకున్న సాహస క్రీడలు, సాధించిన విజయాలు గగుర్పాటు కలిగించాయి. తొంభై ఏళ్ల కేన్సర్ రోగి నోర్మా ప్రపంచాన్ని చుట్టేస్తూ తన శరీర రుగ్మతని కూడా లెక్కచేయకుండా నిజంగా ఓ గ్రేట్ అడ్వెంచర్.

టి.సత్యనారాయణ, వైజాగ్

డేర్ డెవిల్

సాహసోపేతమైన క్రీడల్లో పాల్గొంటూ డేర్‌డెవిల్‌గా పిలిపించుకోవడానికి చాలా మంది తెగ ఉత్సుకత చూపిస్తుంటారు. ఒక్కో అడుగూ ముందుకేస్తూ జీవితంతో పాటు సాహస క్రీడల్నీ ప్రేమించే అర్చన నిజంగా డేర్ డెవిల్. తన సాహస కార్యాలను సమాజ సేవ వైపుకి మళ్లించడం నిజంగా అభినందనీయం. తన మిమిక్రీలతో అందరినీ నవ్వించిన మణి చిన్న వయసులో కన్ను మూయడం బాధ

కలిగించింది. కనుచూపు మేరలోనే కాదు ప్రస్తుతం భూతద్దం వేసి వెతికినా కనిపించని పిచ్చుకల గురించి అందించిన వివరాలు బాగున్నాయి. పర్యావరణ వేత్త దిలావర్ పిచ్చుకలకోసం చేస్తున్న కృషి ఆదర్శనీయం. వాళ్లు అడవులను పెంచారు, స్టార్ వంటకాలు, మహావృక్షాల ప్రియురాలు ఆకట్టుకున్నాయి.

ప్రదీప్, అనంతపురం

నిజంగా అద్భుతం

వందల అడుగుల ఎత్తులో ఉండే చెట్లెక్కడం, ప్రపంచానికి తెలియని వింతలు, విచిత్రాలను పరిచయం చేయడం ఒకెత్తయితే, జడ పదార్థంలా మారిన జైలు ఖైదీలకు చేతన కలిగేలా తన శోధనలో వారినీ భాగస్వాములని చేసి ఖైదీల జీవితాల్లో పరివర్తన తీసుకొచ్చేలా చేయడం నిజంగా అద్భుతం అనిపించింది. చేసిన అప్పులకు అధిక వడ్డీలు కట్టలేని బీద బిక్కిపై పెత్తందారుల అరాచకాలని కళ్లకు కట్టినట్టు చేసింది కాల్‌మనీ కథ. వాళ్లు అడవులను పెంచారు, జెమినీ మణి, పిచుకమ్మా ఎక్కడమ్మా వీధుల్లో యోగా ఆద్యంతం చదివించాయి. అడుగడుగునా అవరోధాలు వచ్చినా లక్ష్యాన్ని విడిచిపెట్టకుండా ఉన్నత విద్యను అందుకున్న కన్నయ్య కుమార్, అతనికి స్ఫూర్తినిచ్చిన తల్లి మీనాదేవి భావితరానికి మార్గదర్శులు.

ఫాతిమా, కర్నూలు

ఆకట్టుకున్న అడవుల పెంపకం

ఇంట్లో ఒక్క మొక్క నాటాలంటే చోటులేదు, మొక్కలు పెడితే ఇల్లంతా మట్టైపోతుంది, రోజూ క్రమం తప్పకుండా నీళ్లు పట్టాలి ఇలా వెయ్యి కారణాలు ముందుకొస్తాయి. అలాంటిది ఎడారిని వనం చేయడమే కాకుండా, విదేశాల్లోనూ పచ్చదనం కోసం పాకులాడే అవిరామ్ రోజిన్, జాదవ్ పయాంగ్, అబ్దుల్ చేసిన కృషిని తెలిపిన కథనం ఆకట్టుకుంది. స్టార్ వంటకాలు, మార్గదర్శి అమ్మే, అట్టమీది కథ, కాల్‌మనీ బాగున్నాయి. మరబొమ్మ తల తిప్పినట్టుగా ఎలా పడితే అలా శరీరాన్ని మలుస్తూ సారా చేసిన వీధుల్లో యోగా ఆకట్టుకుంది. జంతువుల హావభావాలపై తీసిన ఫన్నీ చిత్రాలు భలేగా ఉన్నాయి. కార్టూన్ పంచ్, నవ్వుల్ పువ్వుల్ బాగా నవ్వించాయి.

నళిని, విజయవాడ

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్ : snehaweekly.praja@gmail.com

'నాన్న' సినిమా మిమ్మల్ని కదిలించి ఉంటుంది. విక్రమ్ నటనతో పాటు అతడి కూతురి పాత్రలో ఓ చిన్నారి ఆ సినిమా పేరు చెప్పినప్పుడల్లా కళ్లలో మెదులుతుంది. రాజేంద్ర ప్రసాద్‌తో కలసి 'దాగుడు మూత దండాకోర్' ఆడిన ఆ బంగారు తల్లి సారా అర్జున్. యాడ్ ఫిల్మ్‌లో ముద్దులొలికి ఆ తర్వాత హిందీ చిత్రాల్లో గారాలు పోయింది. సారా నటనకు ఫిదా అయిన దక్షిణాది చిత్ర పరిశ్రమ వరసగా అవకాశాలు ఇచ్చింది.

ముద్దుల మనవరాలు

- సారా పుట్టిన ఊరు ముంబై. తండ్రి రాజ్ అర్జున్ కూడా నటుడే. తల్లి సాన్యా అహ్మద్ డ్యాన్స్ టీచర్.
- ఇద్దరిదీ భోపాల్ అయినా 2000 నుంచి ముంబైలో స్థిరపడ్డారు. 2005 జూన్ 18న సారా పుట్టింది.
- ఓ షాపింగ్ మాల్‌లో సారాను చూసి ఓ కమర్షియల్‌లో నటించేందుకు అర్జున్ వెంటపడ్డారు కంపెనీవాళ్లు. అప్పుడామె వయసు ఒకటిన్నరేళ్లు.
- ఆరేళ్ల వయస్సు వచ్చేనాటికే బోలెడు యాడ్ ఫిల్మ్‌లో నటించేసింది.
- అలా తమిళ దర్శకుడు ఎ.ఎల్. విజయ్ తీసిన ఓ యాడ్‌లో రెండేళ్ల సారా బాగా నటించి ఆయన మెప్పు పొందింది. ఆ తర్వాత ఓ చిన్నారి చుట్టుతా తిరిగే 'దైవ తిరుమగల్' చిత్రం కోసం సారాను తీసుకున్నాడు విజయ్. లీడ్ రోల్‌లో అద్భుతంగా నటించిన ఆ చిత్రమే 'నాన్న'.
- 'నాన్న' చిత్రం క్లైమ్యాక్స్‌లోని కోర్టు సీనప్పుడు సారా విక్రమ్‌తో కళ్లు తిప్పుతూ చేతి సైగలతో మాట్లాడే సన్నివేశం హృదయాల్ని ద్రవింపజేస్తుంది. ఈ సీన్‌లో ఆమె నటనకు మంచి మార్కులు పడ్డాయి.
- ఆ చిత్రం కోసం సారా తమిళ పదాల్నెలా పలకాలో నేర్చుకుంది.
- సారా '404' అనే చిత్రంతో బాలీవుడ్‌కు పరిచయమైంది. అందులో టిస్కా చోప్రా కూతురు పాత్రలో నటించింది.
- సారా తండ్రితో కలసి 'టుమారో' అనే చిత్రంలో నటించింది. అమ్జద్ ఖాన్ తీసిన ఈ చిత్రం థియేటర్లలో రిలీజ్ కాలేదు.
- ఇమ్రాన్ హష్మీ హీరోగా నటించిన 'ఏక్ థీ దయాన్' చిత్రంలో ఓ పాత్రలో సారా నటనను చూసి సహ నటులైన కొంకణా సేన్, పవన్ మల్హోత్రాలు నోరెళ్లబెట్టారట.
- విజయ్ సినిమా 'శైవం'లో మళ్లీ లీడ్‌రోల్‌లో నటించి విమర్శకుల మెప్పు పొందింది. తాతయ్య పాత్రలో నటించిన నాజర్‌కు ముద్దుల మనువరాలిగా సందడి చేసే పాత్రలో సారా నటన అద్భుతం.
- ఈ చిత్రాన్నే క్రిష్ రాజేంద్ర ప్రసాద్ నాజర్ పాత్రధారణలో 'దాగుడు మూత దండాకోర్' చిత్రంగా మలిచారు. ఇందులోను సారానే మనవరాలి పాత్రకి తీసుకున్నారు. అంత అద్భుతంగా నటించింది 'శైవం'లో సారా.
- దర్శకుడు విజయ్‌ను మామా అని పిలిచే సారా కోసమే విజయ్ చిన్నారిని లీడ్ రోల్‌లో ఎంచుకుని రెండు చిత్రాలు తీశాడేమో అనిపిస్తుంది.
- ఐశ్వర్యారాయ్ గతేడాది రీ-ఎంట్రీ ఇచ్చిన 'జజ్బా' చిత్రంలో సానయా పాత్రలో సారా బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చింది.
- ఇప్పటి వరకు సారా సుమారు 70కి పైగా యాడ్ ఫిల్మ్‌లో నటించింది.
- అనూప్ సింగ్ దర్శకత్వంలో రాబోతోన్న అంతర్జాతీయ చిత్రం 'ది సాంగ్ ఆఫ్ ది స్కార్పియన్స్'లో సారా నటిస్తోంది. విలక్షణ నటుడు ఇర్ఫాన్ ఖాన్‌తో కలసి జజ్బాలో నటించగా ఇది రెండో సినిమా.
- సారాకు మిగతా పిల్లలు ఎగిరి గంతేసే కేకులు, చాకొలెట్‌లంటే అంత ఇష్టం ఉండదు. జిమ్నాస్టిక్స్, స్కేటింగ్ అంటే సారాకు ప్రాణం.

✦



ఫ్రేన్ సెలాక్ సంగతి చెబితే ఆయన్ను అదృష్టవంతుడనాలో, దురదృష్టవంతుడనాలో తేల్చుకోలేరు. క్రొయేషియాకు చెందిన ఫ్రేన్ ఏడు పెను ప్రమాదాల్లో ప్రాణాలతో బయట పడ్డాడు. పెద్ద లాటరీ కూడా తగిలింది. అందరూ నువ్వు భలేగా చావు నుంచి ఎస్కేప్ అవుతుంటావంటే, "మీకు అర్థమవుతుందా ఒక ప్రమాదమే ఎక్కువ. ఏడు సార్లు చావు తరిమితే ఎలా ఉంటుందో తెలుసా" అని బాధ పడతాడు. ఈ ఏడు వింతలకు తోడు మరో నాలుగు విచిత్రాలు కూడా ఉన్నాయి ఫ్రేన్ జీవితంలో.

ఏడు వింతలే..!

ఫ్రేన్ జీవితంపై సినిమా తీస్తే ఏం మస్కా కొడతారు గురూ.. ఇది రియల్‌గా సాధ్యమా? మరీ ఇంత వెర్రిగా జనాలు నమ్మేస్తారనుకుంటారా అని సీట్లలో నుంచి లేచి వెళ్లిపోతారు. యదార్థ కథ అని పెడితే గానీ ఎలా తప్పించుకున్నాడబ్బా అని ఆసక్తితో చూస్తారు. అంత స్ట్రేంజ్‌గా ఉంటుంది ఫ్రేన్ స్టోరీ. అదే స్టోరీలు. క్రొయేషియాలో 1929లో పుట్టిన ఫ్రేన్‌కు చావును దగ్గరగా చూసి రావడమనేది ఏంటో చాలా సిల్లీ విషయం అయిపోయింది. సంగీత మాస్టారుగా పనిచేసే సెలాక్‌కు తొలి చావు పలకరింపు 1957లో ఎదురైంది. అతడెక్కిన బస్సు నదిలో కొట్టుకుపోయింది. ఎలాగోలా బస్సులో నుంచి జారుకుని ఈదుకుంటూ ఒడ్డుకు చేరిన సలేక్ మళ్లీ అలాంటిది ఎదురవుతుందని ఊహించి ఉండడు. కొన్నేళ్ల తర్వాత 1962లో ఊరి పని మీద రైలు ప్రయాణం చేశాడు. సారాజేవో నుంచి డుబ్రోవ్‌నిక్‌కు బయలుదేరిన ఆ రైలు పట్టాలు తప్పి పక్కనున్న నదిలో పడింది. అది కూడా చలికి గడ్డకట్టుకుపోయిన నదిలో పడిపోయింది. ఈసారి మాత్రం బతకడనుకున్నాడు. మంచు నీటిలో ఈత కొట్టడం వల్ల హైపోథెర్మియాకు, షాక్‌కు గురయ్యాడు. చేయి కూడా విరిగింది. కానీ బతికి మరో ప్రయాణానికి పెట్టె సర్దాడు. ఫ్రేన్ ప్రాణాలతో బయటపడ్డా 17 మంది ప్రాణాలు నీటిలో కలిసిపోయాయి.

అన్నీ త్రుటిలోనే..

ఏదన్నా యాక్సిడెంట్ సన్నివేశాన్ని చూస్తేనే బిగదీసుకుపోతాం. చిన్నపాటి ప్రమాదంలో పడితే పై ప్రాణాలు పైనే ఎగిరిపోయే వారుంటారు. మరి ఇన్ని యాక్సిడెంట్‌లలో కూడా మరణం అంచుల వరకు వెళ్లి మళ్లీ వెనక్కొచ్చేస్తున్న తనను చూసి తానే ఆశ్చర్యపోయేవాడు ఫ్రేన్. ఆశ్చర్యం సంగతేమో కానీ ఇంకేం పెద్ద ప్రమాదంలో పడతానో, ఏం ముంచుకొస్తుందోనని తన మీద తనే జాలిపడేవాడు. అప్పటి నుంచి ప్రమాదాల్ని ఊహిస్తుండటం మొదలెట్టాడు. అనుకున్నట్టే ఈసారి లిస్ట్‌లో మిగిలిపోయింది ఏమిటా అని లెక్కలేసుకుంటే... విమాన ప్రమాదం బ్యాలెన్స్ ఉంది. అదే జరిగితే ఇక మరో లెక్కేసుకుంటానికి మిగిలి ఉంటానా అని కూడా అనుకున్నాడట. 1963లో జరిగిన ఆ ప్రమాదంలో 19 మంది మృతి చెందగా ఫ్రేన్‌కు ఇంకా ఈ భూమ్మీద నూకలు మిగిలే ఉన్నాయి. సరిగ్గా అది నేలను ఢీకొని పేలుడు జరగడానికి కొంచెం ముందర విమానం తలుపు ఊడి గాలి ఒత్తిడిలో మార్పు కారణంగా ఫ్రేన్ విమానంలోంచి బయటకు విసురుగా పడ్డాడట. అది కూడా వెళ్లెళ్లి ఓ గడ్డివాములో పడ్డాడట. 1966లో మరోసారి బస్సు ప్రమాదం జరిగింది. రోడ్డు నుంచి బస్సు పక్కకు జారడంతో నలుగురు చనిపోయారు. ఫ్రేన్ గురించి చెప్పాల్సిందేముంది. 1968లో ఫ్రేన్‌కు బుల్లెట్ దిగింది. తన కొడుకుకు గన్‌ను ఎలా పట్టుకోవాలో చూపిస్తుండగా సేఫ్టీ ట్రిగ్గర్ అకస్మాత్తుగా తెరుచుకుంది. ఆ హడావిడిలో గన్‌ను కొడుకు నుంచి దూరం జరపబోయి తనను తానే కాల్చుకున్నాడు. వెంటనే ఆస్పత్రికి చేర్చడంతో శస్త్రచికిత్స చేసి వైద్యులు ఫ్రేన్ ప్రాణాల్ని నిలబెట్టారు. 1970, 73లో ఫ్రేన్ ప్రయాణిస్తున్న కారుల్లో ఉన్నట్టుండి మంటలు చెలరేగాయి. ఒక ప్రమాదానికి కారణం ఫ్యూయల్ పంప్‌లో లోపం. ఆ ప్రమాదంలో ఫ్రేన్ జుట్టంతా కాలిపోయింది. 1995లో జాగ్రెబ్ వీధుల్లో నడుస్తుండగా అదుపు తప్పిన బస్సు గుద్దేసింది. చిన్న గాయాలతోనే బయటపడ్డాడు. 1996లో జరిగిన ప్రమాదం మరీ విచిత్రంగా ఉంటుంది. కొండ మలుపులో తాను నడుపుతున్న కారును తిప్పితే ఎదురుగా ఐరాసకు చెందిన ట్రక్ కనిపించింది. దాన్ని తప్పించబోయి ఘాట్ రోడ్డు పక్కగా ఉన్న బారియర్‌ను ఢీకొన్నాడు. ఆ దెబ్బకు కారు సీట్‌లోంచి ఒక్కసారిగా ఎగిరి ఫ్రేన్ ఓ చెట్టు మీద పడ్డాడు. పక్కనే పెద్ద లోయ. ఆయన వాహనం 300 అడుగుల లోతున్న ఆ లోయలోకి పల్టీలు కొడుతూ పడిపోయింది.

లాటరీ తగిలింది..

ఇన్ని ప్రమాదాల్లో చిక్కుకున్నా ఓ విషయం మాత్రం ఊరటనిచ్చేదే. 2003లో ఫ్రేన్‌కు ఏకంగా



6 కోట్ల రూపాయల (అటుఇటుగా) లాటరీ తగిలేసింది. అప్పుడు ఆయనకు 73 ఏళ్లు. 5వ సారి పెళ్లికి రెడీ అయ్యాడపుడు. లాటరీ డబ్బులతో రెండిళ్లు, ఓ బోట్ కొనుక్కున్నాడు. 2010లో తన సంపదను మిత్రులకు, బంధువులకు, సన్నిహితులకు పంచేశాడు. ఓ ప్రైవేట్ దీవిలో ఉన్న తన లగ్జరీ గృహాన్ని అమ్మేశాడు. తిరిగి తన ఊరైన దక్షిణ జాగ్రెబ్‌లోని పెట్రిన్జాలో గడుపుతున్నాడు. తమ కోసం ఉంచుకున్న డబ్బుతో తొడ ఎముక రీప్లేస్‌మెంట్ సర్జరీకి వాడుకున్నాడు. మిగతాది తన భార్య కేటారినాతో కలిసి సంతోషంగా రోజులు గడిపేందుకు దాచుకున్నాడు. డబ్బు ఏ విషయాన్ని మార్చలేదని, తనకు కావాల్సింది భార్యతో సంతోషంగా ఉండటమేనని చెప్పాడు. కేటారినా కన్నా ముందు ఫ్రేన్‌కు నాలుగు పెళ్లిళ్లు అవ్వగా అవన్నీ కూడా పెను ప్రమాదాలేనని నవ్వుతూ చెబుతాడు ఫ్రేన్. ఇంత విచిత్రంగా ఉన్న ఫ్రేన్ కథని న్యూయార్క్‌కు చెందిన డేవిడ్ రాన్సమ్ తన 'దిస్ అండ్ దట్ విజువల్స్' కంపెనీ ద్వారా యానిమేటెడ్ వీడియో తయారు చేసి యూట్యూబ్‌లో పెట్టాడు. ప్రతి సంఘటనను వెరిఫై చేయకుండా తనకందిన సమాచారంతో తీసిన ఈ ఫన్నీ వీడియోను 25 లక్షల మంది పైగా చూసేశారు. ఫ్రేన్ ప్రాణాల మీది యాక్సిడెంట్లను ఫన్నీగా చూపించడంతో అతడి మనసు నొచ్చుకుంది.

–జే

కార్టూన్ పంచ్



అల్ప సంతోషి

మల్లేష్‌కు అల్లావుద్దీన్ అద్భుత దీపం దొరికింది. దాన్ని రుద్దాడు. అందులోంచి భూతం ప్రత్యక్షమైంది.

'ఆజ్ఞాపించండి ప్రభు?' అని అడిగింది వినయంగా..

'ఓ పెద్ద బంగ్లా, దాని నిండా ఫర్నీచర్, చుట్టూ అందమైన గార్డెన్, బంగ్లా ఎదుట ఎల్లపుడు అందుబాటులో ఉండే ఖరీదైన కార్...' అని చెప్పుకుంటూ పోయాడు మల్లేష్.

'అంతేనా ..ఇంకేమైనా కోరికలు ఉన్నాయా?' అనడిగింది భూతం.

ఆ బంగ్లాలో నాకు సెక్యూరిటీ గార్డ్ ఉద్యోగం అన్నాడు మల్లేష్.



నవ్వుల్- పువ్వుల్





మది మదిలో ఉగాది

అట్టమీది కథ

ఉగాది తెలుగు వారి తొలి పండుగ. సంవత్సరాది అయిన ఉగాదిని కొంచెం అటుఇటుగా లేదా అదే రోజున దేశంలోని ఇతర ప్రాంతాల్లోను పలు పేర్లతో జరుపుకుంటారు. ఓ చోట హోలీ ఆడితే మరో చోట చక్కటి సాద్య విందారగిస్తారు. ఓ ప్రాంతంలో తీయటి పానకంతో పసందు చేస్తే.. మరో ప్రాంతంలో కటిక చేదు వేప ముద్ద మింగుతారు. ఒకరేమో ఉదయాన్నే లేవగానే తొలుత చూసేది ఐశ్వర్యాన్ని అయితే.. మరొకరు రాత్రికి దీపాల వెలుగులో కాంతుల్ని కాంచుతారు. ఇలా మదిమదిలో ఉగాది వసంతాలు ఆకాంక్షలతో ప్రారంభమై మంచి రోజులకు శుభాకాంక్షలు పలుకుతాయి.

తెలుగు నేలపై సూరీడి వేన వెలుగులకు లేత మామిడి పూత ఉగాది గంధాన్ని అద్దుతుంది. ప్రకృతి నిండుదనం నింపేసుకుని నవ వసంతానికి పచ్చ తోరణం కడుతుంది. కోయిల కూతల్లో అందరికీ శుభాకాంక్షలు అందుతాయి. కొత్త ఏడాదిలా కాలం లెక్కల్లో ఓ చేంజ్ అంతే. కానీ ఎప్పుడే కష్టాలకు, సంతోషాలకు, నవ్వులకు, కన్నీళ్లకు పాజ్ ఉండదంతే. ఈ లాజిక్‌నే పట్టేసి జీవితంలోని ఆరు పార్శ్వాల రుచిని చూడక తప్పదనే దానికి సింబాలిక్‌గా ఇక్కడ గడపగడపా తెలుగు సంవత్సరాది శుభాకాంక్షల్ని ఉగాది పచ్చడితో చెప్పుకుంటాయి. అన్నీ రోజులకు ఆహ్వానం పలుకుతూనే కాసింత తీపి ఎక్కువ చేసుకుని ఆశావాదానికి పాకం పట్టేస్తాం. తెలుగువారి తొలి పండగ విశేషమిదే. కానీ సంతోషాలకు ఇసుమంతైనా ఖాళీ ఉండకూడదన్నట్టు రంగుల్లో ముంచేసుకుంటారు ఉత్తరాది వాళ్లు. మనలా సుఖ, దు:ఖాలకు సింబాలిక్‌లు ఏమీ లేకుండా అంతా నిండైన గులాల్ చల్లుకుని ఇక రానున్నవన్నీ మంచి రోజులేనని నమ్మబలుక్కుంటారు. ఇక ఈశాన్యంలోని అస్సామీలైతే పాత ఛాయలన్నింటినీ కడిగేసుకుని తాజాగా రోజులు బిహూమంటూ ప్రారంభిస్తారు. తమిళులు సంపదను కన్నార్పకుండా కన్నిగా తేరిపారా చూసి ఇక అంతా ఐశ్వర్యాన్నే కళ్ల జూస్తామని శుభ సూచనలు చేసుకుంటారు. ఇలా ఒక్కో చోట ఒక్కో రకంగా వసంతానికి స్వాగతం పలుకుతారు. వ్యవసాయ ప్రధానమైన పండుగగా చెప్పే ఉగాది పల్లె వాసుల కేలండర్లని రిఫ్రెష్ చేస్తుంది. మరో ఏడాదికి ఈ రోజుల్లోనే టైం టేబుల్ సిద్ధం చేసుకుంటారు. రబీ పంట పూర్తయ్యాక వచ్చే ఈ పండుగ కూడా ఓ రైతు పండుగే. కర్షకుడి కష్టానికి ప్రతిఫలం దక్కిన సంతోషం ఓ పక్క.. మరో సాగుకు నిర్ణయం తీసుకునే కీలక సమయం ఓ పక్క ఉగాదిని కొత్త రోజులకు వారధి చేస్తుంది. ఇక పట్నపు వాసులకు పల్లె రుచి తగులుతుంది. వ్యాపారాలు, కొత్త ప్రయత్నాలకు వేదిక అవుతుందీ పండుగ. జనవరి 1న తీసుకునే రెజెల్యూషన్స్‌లానే ఉగాది కూడా ఎన్నో కార్యక్రమాలకు చిట్టాపద్దులు తెరుస్తుంది. తెలుగు, కన్నడ, మరాఠి, కాశ్మీరీ, సింధీల నూతన సంవత్సరం దాదాపుగా ఒకే రోజున మొదలవుతుంది. కానీ దేశంలోని మిగతా ప్రాంతాల్లో వివిధ సందర్భాలు, తిథులకు తగ్గట్టు కొత్త ఏడాదికి ఆహ్వానం పలుకుతారు.

- అజయ్ కుమార్ వారాల
9502395077

కొంకణ్‌లో రంగవల్లికలు వెలసి..

సరిగ్గా మన ఉగాది నాడే మనతో కలసి కర్నాటక, మహారాష్ట్ర, కొంకణి వాసులు నూతన సంవత్సర సంబురాలు చేసుకుంటారు. ఆ సంబరాలే గుడీ పాడ్‌వా. చైత్ర మాసారంభంలో వచ్చే శుద్ధ పాడ్యమి తిథిన పండుగ జరుపుకుంటారు. పండుగకు చాలా రోజుల ముందు నుంచే ఏర్పాట్లు చేసుకుంటారు. ఇళ్లను, పరిసరాలను శుభ్రం చేసుకుంటారు. గుడీ అనే ఓ ధ్వజాన్ని నిలబెడతారు. ఈ గుడీని ఓ వెదురు కర్రకు బెల్లం, వేపాకులు, మామిడి రెమ్మలు కట్టి, పూలమాలను వేసి ఓ రాగి చెంబు కానీ వెండి చెంబును కానీ బోర్లిస్తారు. జరీ అంచున్న ఎర్రటి లేదా పసుపు పచ్చ కలిసిన వస్త్రాన్ని గుడీకి కడతారు. ఈ గుడీని అందరికీ కనిపించేలా ఇంటి గుమ్మం వద్ద ఎత్తైన చోట నిలబెడతారు. ఇలా ప్రకృతికి కృతజ్ఞతలు చెబుతారు. చెడుపై విజయానికి ప్రతీకగా కూడా చెబుతారు. షడ్రుచులు ఉండేలా వంటకాలు విందు చేస్తాయి. మహారాష్ట్రీయుల ఫేవరెట్ అయిన శ్రీఖండ్ కచ్చితంగా రుచి ఈ రోజు చూడాల్సిందే. కొంకణి వాసులైతే కణగాచి ఖీర్‌ని వడ్డిస్తారు. కొత్త బట్టలతో కొంగొత్తగా రోజులు ప్రారంభిస్తారు. ఇంటి ముందు రంగవల్లికలతో ఆహ్వాన పత్రికలు రాస్తారు. ఉగాది పచ్చడి కాకుండా పూర్తిగా వేపాకుల ముద్దనే కొద్దిగా మింగి రోజు ప్రారంభిస్తారు. కొన్ని చోట్ల చింతపండు రసాన్ని వేప ముద్దకు కలుపుకుని తీసుకుంటారు. ఇది ఆరోగ్యకరమని నమ్ముతారు. గుడీ పాడ్వాను బాలినీయులు, మారిషస్ వాసులు కూడా జరుపుకుంటారు.

అస్సామీల రొంగాలి

బొహాగ్ బిహుగా పిలిచే ఈ సంవత్సరాదిని అస్సాం ప్రజలు వేడుక చేసుకుంటారు. ఎన్నో విభిన్న జాతులు, తెగలతో ఉండే అస్సామీలందరినీ ఈ పండుగ ఒక్కటి చేస్తుంది. అందరూ కలసి జరుపుకునే ఈ నూతన సంవత్సరాది పండుగ సాగు కాలాలకు అనుగుణంగా జరుపుకునేది. రంగొలి బిహూ, కొంగాలి బిహూ, భోగాలి బిహూ అనే మూడు పంట సీజన్లకు మూడు పండుగలుంటాయి. సంవత్సరాదిగా చేసుకునే ఈ రొంగాలి బిహూలో 7 దశలుంటాయి. అవి రాతి, చోట్, గోరు, మనుహ్, కుటుమ్, మేలా, చేర. రాతి బిహూ నాడు వందల ఏళ్లనాటి వృక్షం కింద గానీ పొలంలో గానీ ఉత్సవం మొదలవుతుంది. చౌడాంగ్ గ్రామాల్లో మహిళలందరూ కలసి సంబురాలు జరుపుకుంటారు. చోట్ బిహూ పిల్లలకు. వారి ఆటపాటలు, కేరింతల్లో గ్రామాలు సంతోషాన్ని నింపుకుంటాయి. బాలి హుసోరిగా పిలిచే ఈ అంకం నిజంగానే ఉత్సవంలో హుషారు నింపేస్తుంది. మన ఉగాదికి వారం అటుఇటుగా వీరి ఏడాది మొదలవుతుంది. చివరి ఏడాదికి వీడ్కోలు పలుకుతూ వీరు గోరు బిహు జరుపుకుంటారు. వ్యవసాయానికి గొప్ప సాయమే చేసే ఆవు, ఎద్దులు, ఇతర పశువుల సేవలను గౌరవించడం ఆ రోజు విధి. పశువుల్ని చెరువులు, నదుల వద్దకు గుంపులుగా చేర్చి పసుపు ఇతర ఔషధ మిశ్రమాలతో శుభ్రం చేస్తారు. అప్పుడు "దిగ్లోటి దిఘాల్ పాట్" వంటి జానపదాల్ని పాడతారు. మరో ఆకట్టుకునే ఆటల పోటీ కూడా నిర్వహిస్తారు. 'ఎక్సో ఎబిద్ హాక్' అనే ఈ ఆటలో 101 కాయగూరల రకాల్ని సేకరించాలి. కోరీ ఖేల్ అనే తిండి తగువులాట కూడా ఓ హైలెట్. తర్వాతి రోజును మనుహ్ బిహూగా పెద్దల పండుగ జరుపుకుంటారు. ఆ రోజున బహుమతిగా ఇచ్చే 'గముసా' అనే వస్త్రంతో అస్సామీల అనుబంధం ప్రత్యేకం. స్నేహానికి, ప్రేమకు, గౌరవానికి, ఆప్యాయతలకు, ఆతిథ్యానికి ఇలా ప్రతి విషయంతో ముడిపడి ఉంటుందది. ఇలా మిగతా బిహూలన్ని దాటాక చేరా బిహూ నాడు 'పీతా' అనే పిండి వంటకాన్ని ఒకరికొకరు పంచుకుని శుభాకాంక్షలు



రంగులు చల్లి..

రంగులు జల్లుకునే హోలీనే ఉత్తరాదిన తొలి వెలుగులకు ఆహ్వాన ఖేళీ. మధ్య ప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర ప్రదేశ్, హర్యానా, ఉత్తరాఖండ్, బీహార్, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, చత్తీస్‌ఘడ్‌లు అంగరంగంగా రంగుల్లో తడిసి ముద్దవుతాయి. సంవత్సరంలో చివరి మాసమైన ఫాల్గుణ చలి కాలానికి తెరదించితే.. తొలి మాసం చైత్రం వసంతానికి చివుళ్లు వేస్తుంది. అంతవరకు మోడుగా ఉన్న ప్రకృతి అనేక వర్ణాల్లో మొగ్గతొడిగి రంగుల్ని పంచుతుంది. అలా ప్రకృతితో జట్టు కట్టి ఉత్తరాది వాళ్లు రంగులు జల్లుకుంటారు. పేద, ధనిక, పిల్లా, పెద్ద, కులం, ప్రాంతం అనే తేడా లేకుండా బంధువైనా, అపరిచితుడైనా ఆ ఒక్క రోజు గులాల్ జల్లులో కలసి తడవాల్సిందే. ఈ ఒక్కరోజుకే ఆ పండుగలోని స్ఫూర్తి నీరుగారకుండా మిగతా ఏడాదంతా అందరూ కలసిమెలసి సాగితే ఇవే కేరింతలు కొనసాగుతాయి కదా. ఎక్కడలేని సరదాలను మోసుకొచ్చే హోలీ రంగు నీటి యుద్ధంలో పిల్లలే ఎప్పుడూ నెగ్గుతారు. దారెంట దాగుని నీటి బుడగలతో వారు చేసే దాడి నుంచి ఎవరూ తప్పించుకోలేరు. గుంపులుగా చేరి బ్యాండ్‌ను బజాయిస్తూ నృత్యాలతో, పాటలతో రంగుల్లో తడిసి ముద్దవుతారు. హోలీనే వసంత ఉత్సవమని కూడా పిలుస్తారు.

చెప్పుకుంటారు. సంప్రదాయ ఆటల పోటీలు ఎక్కువగా జరుగుతాయి. ముఖోలి బిహూ, బిహూగీత్స్ అనే ప్రత్యేక నృత్య, గీతాలతో ఉత్సవాలు హోరెత్తుతాయి.

అంతా పుత్తడే..

వరుడ పిరాప్పుగా పిలిచే పుతాండు కొత్త ఏడాది పండుగ తమిళనాట. దీని తిథి అస్సామీల సంవత్సరాదికి దగ్గరగానే ఉంటుంది. శ్రీలంకలోను పెద్ద ఎత్తున జరుపుకునే ఈ పండుగ సందర్భంగా ఆ దేశంలోను సెలవు ప్రకటిస్తారు. మన ముగ్గులు, కన్నడిగుల రంగవల్లికలు తమిళీయుల ఇంటి ముందు కోలమ్‌లుగా కొలువుదీరుతాయి. వాటి మధ్యగా కుట్టివిలాకు అని ఓ దీపాన్ని వెలిగించి దాని వెలుగుల్లో చెడంతా తొలిగిపోవాలని ప్రార్థనలు చేస్తారు. కన్ని (శుభ దృష్టి) పేరుతో ఆ రోజు జరిగే కార్యక్రమంలో బంగారం, ఫలాలు, తాజా కూరగాయలు, పూలు, బియ్యం వంటి వాటిని ముందుగా చూస్తారు. అది సంపద వృద్ధికి సూచికని నమ్ముతారు. మామిడి పండ్లు, అరటి కాయలు, పనస తొనలు, తమలపాకు వక్క, బంగారు, వెండి ఆభరణాలు, నాణేలు, నోట్లు, పూలు, ఓ అద్దాన్ని ఓ పాత్రలో అందంగా పేర్చి ఉదయం లేవగానే వాటిని చూస్తారు. కుంభకోణం దగ్గరలోని తిరువాడమరుదూర్‌లో కార్ ఫెస్టివల్ పుతాండు సందర్భంగా జరుపుకుంటారు. ఇలా ఐశ్వర్యానికి కొత్త ఏడాదికి లింక్ పెట్టేశారు. పెద్దలు పిల్లలకు కొంత నగదును బహుమతిగా ఇస్తారు. దీన్ని కై విశేషమ్' పేరిట ఆ ఏడాది తొలి చేబదులుగా మంచి లాభాలు రావాలనేది ఉద్దేశం. శ్రీలంక తమిళులు వన మూలిక తైలాలు కలిపిన నీటితో తలారా స్నానం చేసి ఆ ఏడాదిని మొదలెడతారు. 'మరుతు నీర్' అనే ఈ అభ్యంగన స్నానం ఆరోగ్యానికి మేలు చేస్తుంది. 'పోర్ టెంకాయ్' పేరిట యువత కొబ్బరి కాయలతో కొట్లాడే ఆట ఆడుతారు. ఎడ్ల పందేలు కూడా నిర్వహిస్తారు. సింహళీయుల సంవత్సరాది కూడా ఈ ఉత్సవ దినాల్లోనే వస్తుంది. విదేశాల్లో ఉన్న సిక్కులు, మళయాలీలతో కలసి తమిళులు ఉత్సవాలు జరుపుకుంటారు. ఆ మధ్య సంక్రాంతినే తమిళ సంవత్సరాదిగా జరుపుకోవాలని ఓ వివాదం తలెత్తింది. దీనికి రాజకీయ అంశంగాను మారింది. కానీ చివరకు పుతాండునే తమిళ నూతన సంవత్సర పండుగగా పరిగణిస్తున్నారు.

గుజరాతీ దీవాళీ

దేశంలో చాలా ప్రాంతాల్లో కొత్త ఏడాదిని చైత్ర మాసంలో ఆహ్వానిస్తే గుజరాతీయులు మాత్రం కార్తీక మాసంలో కేలండర్లు మార్చుకుంటారు. సాల్ ముబారక్, బేస్తు వరస్‌గా పిలిచే వీరి సంవత్సరాది దీపావళి తర్వాతి రోజున మొదలౌతుంది. ఇక్కడివారు నూతన్ వర్షాభినందన్ అంటూ దీపాల పండుగను ఘనంగా నిర్వహించుకుంటారు. ఉదయం నాలుగు గంటలకు పిల్లలు ఉప్పు గళ్లకు చేరి కొంత ఉప్పు సేకరిస్తారు. దాన్ని ఉదయాన్నే అమ్ముతారు. ఉప్పు రుచిని వాళ్లు సబ్రస్ అంటారు. అన్నీ రుచులని దానర్థం. ఇళ్లకు తోరణాలు కట్టి, ముంగిళ్లను రంగవల్లికలతో అలంకరిస్తారు. ఫర్సాన్ అని పిండి పదార్థాలను, మిఠాయిని ఇరుగు పొరుగు పంచుకుంటారు. గోవర్ధన పర్వతాన్ని పూజిస్తారు. దీవాళి ఉత్సవాల సందర్భంగా గుజరాత్‌లో 5 రోజుల సెలవు ప్రకటిస్తారు. ఒక్కోసారి 7 రోజులు కూడా కొనసాగుతాయి. బలి చక్రవర్తిని సాల్ ముబారక్ రోజున పూజిస్తారు. నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టిన తర్వాతి రోజున సోదరులకు మంచి కలగాలని అక్క చెల్లెళ్లు ప్రార్థనలు చేస్తారు. వారికి హారతి పట్టి తిలకాన్ని దిద్దుతారు. ఈ సందర్భంగా సోదరులు వారికి బహుమతులతో పాటు రక్షణగా ఉంటామని వాగ్దానమిస్తారు. ఇలా ప్రేమ, బాధ్యతల కలబోతగా ఉంటుంది ఈ కార్యక్రమం.



మళయ మార్పులు

కేరళలో ఒక్కో ప్రాంతంలో ఒక్కో తిథిన నూతన సంవత్సర పర్వానికి సిద్ధమవుతారు. మేడొమ్ మాసంలోని తొలి రోజున విషు వేడుకల్ని కొన్ని ప్రాంతాల్లో జరుపుకుంటారు. ఇది చైత్ర మాసానికి దగ్గరగా ఉంటుంది. అదే మలబార్ తీరాన అయితే కన్ని మాసంలోని తొలి రోజున పండుగ చేసుకుంటారు. ట్రావెన్‌కోర్ ప్రాంతంలో చింగమ్ నెల తొలి రోజున ఉత్సవాలు మిన్నంటుతాయి. అయితే ప్రభుత్వం మాత్రం కొల్ల వర్షమ్ ప్రాతిపదికన చింగమ్ మాసం తొలిరోజున అధికారికంగా నూతన ఏడాదికి స్వాగతం పలుకుతారు. మంచి దృశ్యాలను, ప్రాంతాలను సందర్శిస్తారు. సాయంత్రాలను విషువేళ పేరిట బంధు మిత్రులతో వేడుక చేసుకుంటూ 'సాద్య' అనే విందును ఆరగిస్తారు. షడ్రుచులకు చోటున్న ఈ సాద్యలో వెప్పమ్‌పూరసమ్, మంపాజాప్పులిస్సెరి, విషు కంజి, విషు కట్ట ప్రధాన వంటకాలు. తమిళుల కన్ని ఆచారంలానే విషుక్కని ఉంటుంది. ఇక్కడా బంగారు ఆభరణాలు, డబ్బుదస్కం, బియ్యం, కొబ్బరి కాయ, నిమ్మకాయలు, దోసకాయ, పనస పళ్లు, కాటుక, తమళపాకులు, మత గ్రంథాలు, లోహ అద్దంతో పాటు కేరళ రాష్ట్రీయ పుష్పమైన కొన్న పూలు కచ్చితంగా ఉండాల్సిందే. చిన్ని కృష్ణుడి పటం చుట్టుతా వీటిని పేర్చి నీలావిలాక్కు అనే దీప స్తంభం వెలిగించి ప్రార్థనలు చేస్తారు. ఈ ఏర్పాట్లన్ని పూజ మందిరంలో ముందు రాత్రే చేసి ఉదయాన్నే ముందుగా విషుక్కనిని చూస్తారు. విషు పదాక్కమ్‌లో భాగంగా భారీ ఎత్తున బాణాసంచా వెలుగుల్లో కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతారు. దీపావళిని పోలి ఉంటుంది విషు. దీపాలతోటి ఇళ్ల ముంగిళ్లను అలంకరిస్తారు. విషు కన్నీటమ్ పేరిట అద్దెదారులకు, కింది స్థాయి ఉద్యోగులకు బహుమతుల్ని పంచుతారు. పిల్లలకు నగదు బహుమతులిస్తారు.

పంజాబీల వైశాఖీ

ఒక్క పంజాబ్‌లోనే కాదు హర్యానాలోను వైశాఖీ పండుగకు పెద్ద పీట వేస్తారు. వారు అనుసరించే నానాక్షాహి కేలండర్‌లోని రెండో నెల వైశాఖీ తొలి రోజున సంవత్సరాది సంబురాలు జరుపుకుంటారు. సిఖ్ఖుల పదో గురువు గురు గోబింద్ సింగ్‌ను గౌరవిస్తారు. 1699లో పంజాబ్‌లోని ఆనంద్‌పూర్ సాహిబ్ ప్రాంతంలో పెద్ద ఎత్తున కుల వైషమ్యాలు చెలరేగడంతో ఖల్సా పంత్‌ను ఏర్పాటు చేసి కులాన్ని రద్దు చేసిన సందర్భంగా ప్రజలు ఉత్సవాలు జరుపుతారు. భాంగ్రా నృత్యాలు, గిద్దాలతో ఉత్సాహంగా ఉత్సవాల్ని చేసుకుంటారు. పాకిస్థాన్‌లోని పశ్చిమ పంజాబ్ ప్రాంతంలోను అంగరంగ వైభవంగా వైశాఖీ ఉత్సవాలు నిర్వహిస్తారు. పంజాబీయులు ఎక్కువగా స్థిరపడిన యూకే, కెనడా, అమెరికాల్లో కూడా వైశాఖీ శోభాయమానంగా జరుపుకుంటారు. ఆ సందర్భంగా పెరేడ్‌ను నిర్వహిస్తారు. న్యూయార్క్ నగరంలో సేవ పేరిట పంజాబీయులు అన్న ప్రసాదాన్ని అన్నార్తులకు పంచుతారు. ఇతర సేవలు కూడా అవసరార్థులకు ఉచితంగా చేస్తారు. చేతికి పంట వచ్చిన సంతోషంలో రైతన్నలు 'జత్తా ఆయీ వైశాఖీ' అని పెద్దగా ఆనందాన్ని వ్యక్తం చేస్తూ కుటుంబంతో కలసి పొలాలకు చేరుకుంటారు. ఈ సందర్భంగానే వారి వస్త్రధారణ చాలా ప్రత్యేకంగా ఉంటుంది. పురుషులు రంగు రంగుల లుంగీలు, కుర్తాలు, పగ్రీలు ధరిస్తే మహిళలు లెహెంగా, సల్వార్ కమీజ్‌ను వేసుకుంటారు. ఢోల్ భాంగ్రా, గిద్దా పాటలు, నృత్యాలతో పంట భూముల వద్ద ఉత్సాహంగా వేడుక చేసుకుంటారు. నృత్యంలో కదలికలు దుక్కి దున్నడం, నారు వేయడం, పంట కోత ఇలా అంతా కూడా వ్యవసాయ క్షేత్రంలో దశలవారీ చేసే పనులను పోలి ఉంటాయి. చూడ్డానికి చాలా లయబద్ధంగా ఆకట్టుకునేలా వారి నృత్యముంటుంది. సంతోషాన్ని మరింత పెంచేలా వైశాఖీ జాతరలుంటాయి. పంజాబీయుల వంటకాలతో కమ్మని విందు ఏర్పాట్లు ఉంటాయి.

ఎన్ని విందులో..

మణిపూర్‌లో చైరావోబా సంవత్సరాది. ఆ సందర్భంగా సాజిబు నోంగ్మా పంబా అనే ఉత్సవాలకు తెరతీస్తారు. స్థానిక సంప్రదాయాల ప్రకారం వేడుకల్లో ఎన్నో కార్యక్రమాలను జోడిస్తారు. చైరావోబా సరిగ్గా ఉగాది, గుడీ పాడ్వా రోజునే ఉంటుంది. కాశ్మీరీల కొత్త ఏడాది తొలి రోజు ఇక్కడి చైత్రమాసపు నవరాత్రుల్లో తొలి రాత్రి ఘడియల్లో మొదలౌతుంది. ఇది శివరాత్రి పర్వదినంగా జరుపుకుంటారు. మార్వాడీలకు థాప్నా సంవత్సరాది పండుగ. ఇది ఉగాది కన్నా ముందే వస్తుంది. సింధీలకు చేటీ చాంద్ పండుగ రోజు. ఉగాది తర్వాత రోజు వస్తుందిది. సింధీల రుషి అయిన జులేలాల్ జన్మదినోత్సవాన్ని జరుపుకుంటారు. హిమాచల్ వాసులకు చైత్రి, బసోవా కొత్తేడాది పర్వాలు. అక్కడి మూలవాసులు, రైతాంగం బసోవాను బైశాఖ్ (వైశాఖి)లో చేసుకుంటారు. పండుగకు మూడు రోజుల ముందుగా కొద్రా అనే పిండి వంటకాన్ని తయారుచేసుకుంటారు. మూడు రోజుల్లో కమ్మటి రుచికొచ్చే ఈ వంటకాన్ని పుట్టింటికి వచ్చిన కూతుళ్ళు, బంధు గణంతో కలసి తేనెతో విందు చేస్తారు. ఆ సమయంలో సంప్రదాయ పాటల్ని పాడుతారు. పహిల్ బైశాఖ్, బైశాఖీ, మైథిలీ, జూడ్ శీతల్ అని అనేక పేర్లతో నేపాల్, దాని దగ్గరగా ఉన్న భారత ప్రాంతాల్లో కొత్త ఏడాదికి స్వాగతం అందుతుంది. దీన్నే నిరాయాన మేష్ సంక్రాంతి, తిర్హుత అని కూడా పిలుస్తారు. ఇది కూడా తెలుగు వారి ఉగాదికి ఒక రోజు అటు ఇటు గానే ఉంటుంది.

ఒడియా సంక్రాంతిలో..

మహా బిశుబ సంక్రాంతిగా ఒడియా ప్రజలు జరుపుకునే పండుగ రోజే వారి నూతన సంవత్సరాది. మనకు ఉగాది పచ్చడున్నట్టే అక్కడ పటిక బెల్లంతో చేసే పానకాన్ని ఆ రోజు తప్పకుండా సేవిస్తారు. అందుకే దీన్ని పాన సంక్రాంతి అని కూడా పిలుస్తారు. పండ్లు, పాలు, బెల్లం, పెరుగు, చింతకాయ రసాలతో కలిపి చేసే పానకంతో కొత్త రోజులకు ఆహ్వానం పలుకుతారు. తులసి మొక్కపై ఓ కుండ నుంచి బొట్లు బొట్లుగా నీరు పడేట్టు ఏర్పాటు చేస్తారు. దీన్ని బసుంధర తేకి అంటారు. ఆ ఏడాది వర్షాలు కురిసి ప్రకృతి పచ్చదనంతో తొణికిసలాడాలని ఆకాంక్షకు ఇది సింబాలిక్. పక్షులు, జంతువులకు కూడా జల సేవ చేస్తారు. ఇలా నీటికే ప్రాముఖ్యతనిచ్చిన ఈ సంక్రాంతిని జల సంక్రాంతి అని కూడా పిలుస్తారు. నెలపాటు జరిగే వీరి ఉత్సవాలు ఝూము యాత్రతో ముగుస్తాయి. పతువాస్ ఉపవాసాలు చేస్తారు. నిప్పులు, ముళ్ల బాటలో నడుస్తారు.

బెంగాలీల బైశాఖీ

బంగ్లా నబ బర్షో అయిన పొయిలా బొయిశాఖ్ అటు బంగ్లాదేశ్‌లోను జరుపుకుంటారు. అయితే పశ్చిమ బెంగాల్ కన్నా ఒక రోజు ముందే అక్కడ వేడుకలు మొదలవుతాయి. బెంగాలీలు దేశంలో ఎక్కడున్నా ఇదే రోజున నూతన సంవత్సరాది శుభాకాంక్షలు చెప్పుకుంటారు. బంగ్లాదేశ్‌లో జాతీయ సెలవు దినమైన ఈ రోజున 'హాల్ ఖాతా' అని వ్యాపారులు కొత్త ఖాతా పుస్తకాల్ని తెరుస్తారు. కొత్త వ్యాపారాలు, కార్యక్రమాలు ఇతరత్రా పనుల్ని ప్రారంభిస్తారు. బెంగాలీల ఇళ్ల ముందు వైవిధ్యమైన రంగవల్లికలు వేస్తారు. వాటిని అల్పనాలంటారు. ఈ రోజు స్త్రీలు బెంగాలీ సంప్రదాయ చీరలని ధరిస్తారు. ఎర్ర అంచున్న తెల్లని వస్త్రాలను కట్టుకుంటారు. పురుషులు ధోతి, కుర్తా వేసుకుంటారు. మిగతా పండుగల్లో ఖరీదైన ఆహార్యంతో బెంగాలీలు ముచ్చటపడితే బైశాఖీ రోజు మాత్రం ఇలా ప్రత్యేక డ్రెస్ కోడ్‌ను పాటిస్తారు. ఎందుకంటే ఈ పండుగ బెంగాలీ గ్రామసీమల హృదయాలకు ప్రతిబింబం. ఉదయాన్నే జట్లు జట్లుగా ప్రభాత్ ఫేరీలనే ఊరేగింపులో పాల్గొంటారు. అలా వీధుల్లో వెళుతూ అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతారు. భారీ వృక్షాల కిందకు చేరుకుని సూర్యోదయాన్ని చూడటం ఓ ముఖ్య కార్యక్రమం. జత్రాలనే వీధి నాటకాలు ప్రత్యేక ఆకర్షణ. సంవత్సరాదిపై జానపద గీతాలు కూడా ఉన్నాయి. అలాగే రవీంద్రనాథ్ ఠాగోర్ రచించిన 'ఈశో, హె బొయ్‌శాఖ్' పాటను ఢాకా వీధుల్లో కూడా వినొచ్చు. చిట్టగాంగ్‌లో మల్లయుద్ధ పోటీలు జరుగుతాయి. పడవ పందేలు, పావురాల పందేలు కూడా నిర్వహిస్తారు. బంగ్లా సంగీత్ మేళాను ప్రభుత్వం కోల్‌కతాలోని రబీంద్ర సదన్‌లో నిర్వహిస్తుంది. బైశాఖీ నెలలో వివాహాలు ఎక్కువగా చేస్తారు.

కబడ్డీ కెరటం

రాహుల్ చౌదరి.. యూత్‌కు ఇప్పుడు పరిచయం అక్కర్లేని కబడ్డీ ఐకాన్. కూత పెట్టి కోర్టులోకి వెళితే పాయింట్లు తేవడమే తప్ప.. దొరికిపోవడం తెలియని ప్లేయర్. 22 ఏళ్ల రాహుల్ చౌదరి కాళ్లలో స్ప్రింగులున్నట్లు గాల్లోకి ఎగిరి తొడగొడుతుంటే.. క్రీడాభిమానులు కేరింతలు కొట్టాల్సిందే. పులి బోనులోకి వెళ్లినట్లు.. ప్రత్యర్థి కోర్టులో సెంటర్‌లోకి వెళ్లి మరీ.. గాల్లో డైవింగ్ చేస్తూ మరీ వెనక్కు వచ్చే సీన్స్ చూస్తే ఎవరికైనా ఔరా అనిపించక తప్పదు. కబడ్డీలో రెయిడింగ్ స్పెషలిస్ట్ అయిన రాహుల్ చౌదరి ఇప్పుడు తెలుగు టైటాన్స్ కెప్టెన్. తన జట్టులో అందరూ అవుటైపోయినా.. పర్వాలేదు.. ఎందుకంటే రాహుల్ ఒక్కసారి కూతకెళ్లాడంటే.. పాయింట్ల కోత కోసుకొస్తాడు.



1993 జూన్ 16న పుట్టిన రాహుల్ చౌదరిది ఉత్తరప్రదేశ్‌లోని బింజోర్. స్కూల్ చదువుతున్నప్పుడే కబడ్డీ అంటే కూత పెట్టేసేవాడు. అందుకే నాన్న చితకబాదినా సరే.. ఆటను మాత్రం వదిలిపెట్టలేదు. చదువు లేకపోయినా పర్వాలేదు.. తిండి లేకపోయినా పర్వాలేదు.. కాని కబడ్డీ లేకపోతే మాత్రం బతకలేననుకున్నాడు. అందుకే పేరెంట్స్ వద్దన్నా వినలేదు. కొట్టినా వెనక్కు తగ్గలేదు. 13 ఏళ్లకే రింగులోకి దిగాడు. 21 ఏళ్లకే భారత టీమ్ తరపున బీచ్ కబడ్డీకి ఆసియా కప్ పోటీల్లో ఆడాడు. పాస్‌పోర్ట్ లేక ఆసియా క్రీడల్లో పాల్గొనే అవకాశం కోల్పోయిన రాహుల్ 2018లో కచ్చితంగా వెళతానంటున్నాడు.

సింహం సింగిల్‌గా వస్తుందనే డైలాగ్ సినిమాలోది. ఇక్కడ ఓ సింహం రియల్‌గానే సింగిల్‌గా వస్తుంది. సింహగర్జన చేస్తూ శత్రు శిబిరంలోకి దూసుకు పోతుంది. పంజా విసురుతూ మీద పడే శత్రువులను సింగిల్ హ్యాండ్‌తో తోసి పారేస్తుంది. సింహనాదం చేస్తూ గాల్లో ఎగిరి మరీ తొడ గొడుతుంది. విజయం తప్ప అపజయం ఎరగని సింహం అడవికి రారాజు అయితే, ఈ సింహం కబడ్డీకి రారాజు. ఆ సింహం పేరే రాహుల్ చౌదరి.



పొడుగ్గా అందంగా.. మెలితిరిగిన కండలతో.. బాలీవుడ్ హీరోలా ఉండే రాహుల్‌కి ఇప్పుడు ఫ్యాన్స్ ఎక్కువే. కబడ్డీ ప్లేయర్‌గా ప్రభుత్వోద్యోగం వచ్చాక ఇంటా, బయటా గౌరవం పెరిగిందట. ఇప్పుడు తెలుగు టైటాన్స్ తరపున ప్రో కబడ్డీలో ఆడటం మొదలెట్టాక క్రేజ్ బాగా పెరిగిపోయింది. ఒకప్పుడు ఆడొద్దని కొట్టిన తల్లిదండ్రులు.. రేపు గెలుస్తున్నావా లేదా అని ఫోన్ చేసి మరీ అడుగుతున్నారని నవ్వుతూ చెబుతాడు.

అటాకింగ్ బాగా చేసే రాహుల్.. దాని కన్నా ప్రత్యర్థి కూతకు వచ్చినప్పుడు పట్టుకోవడంలోనే అసలు విజయం ఉందంటాడు. అటాకింగ్‌తో సగం గేమ్ మాత్రమే గెలవగలం. కాని రక్షణ వ్యూహంతో ప్రత్యర్థిని కూడా పట్టుకోగలిగినప్పుడే పూర్తిగా మ్యాచ్‌పై పట్టు సాధిస్తామని చెబుతాడు. కూతకు వెళితే పాయింట్లు గెలుచుకోవడానికి తెగువ, ధైర్యంతో పాటు ఫిట్‌నెస్ కావాలి.. కాని ప్రత్యర్థిని పట్టుకోవాలంటే తెలివితేటలతో కూడిన వ్యూహం కావాలంటాడు. తెలుగు టైటాన్స్‌ను మొదట్లో ఎవరూ పట్టించుకోలేదు. కాని ప్రోకబడ్డీలో ఇప్పుడదాక సంచలన జట్టు. సెమీస్‌కు దగ్గర దాకా వెళ్లి పాయింట్ల తేడాతో ఆగిపోయిన టీమ్. ఆ జట్టు విజయాల్లో రాహుల్ చౌదరిదే కీలక పాత్ర. మధ్యతరగతి కుటుంబంలో పుట్టినా.. నచ్చిన గేమ్ కోసం జీవితాన్నే పణంగా పెట్టి.. 22 ఏళ్ల వయసులోనే జీవితానికి సరిపడా కీర్తి ప్రతిష్టలను సంపాదించేశాడు రాహుల్ చౌదరి.

తెలుగు టైటాన్స్‌తో వచ్చిన కీర్తి ప్రతిష్టలు, డబ్బుతో ఎవరైనా సంతృప్తి పడిపోతారు. కానీ రాహుల్ అలా కాదు. భారత్‌ను ఆసియా కప్‌లో గెలిపించడం అతని లక్ష్యం. గోల్డ్‌మెడల్ సాధించిపెట్టాలనేదే అతని ధ్యేయం. మువ్వన్నెల జెండాను కబడ్డీ కోర్టులో సగర్వంగా ఎగరవేయాలనేదే అతని టార్గెట్. అది కచ్చితంగా సాధిస్తానని ఆత్మవిశ్వాసంతో చెబుతున్నాడీ కబడ్డీ కెరటం.. రాహుల్ చౌదరి.

-జి. రవికిరణ్

తెలుసా

వజ్రాల ధగధగలు....

ఇప్పుడు మనకు లభించే వజ్రాలు మూడు బిలియన్ సంవత్సరాల క్రితం భూగర్భంలోని అత్యధిక పీడనంలో 900-1300 సెల్సియస్ వేడి వద్ద తయారయ్యాయి.

భారత్‌లో వజ్రాల నిల్వలు తగ్గిపోతున్నట్టే, రత్నాలు అధికంగా లభించే బ్రెజిల్ లోని మినస్ జరిస్‌లోనూ వాటి లభ్యత తగ్గిపోతోంది.

గురు, శని గ్రహాలపై తరచూ వజ్రాలు వర్షంలా పడుతుంటాయి.

భూమిలో నుంచి వెలికితీస్తున్న 80 శాతం వజ్రాలు నగల తయారీకి ఉపయోగపడవు.

రాలిపోయిన ఒక్క నక్షత్రం నుండి కొన్ని వేల వజ్రాలను పోగుచేసుకోవచ్చు.



వజ్రాలు నిజమైనవో కావో తెలుసుకోడానికి ఎక్స్‌రే సాయపడుతుంది. ఎందుకంటే నిజమైన వజ్రాలు ఎక్స్‌రేలో కనిపించవు.

ల్యాబ్‌లో సృష్టించిన వజ్రాలు, భూమి నుండి తవ్వి తీసిన వజ్రాలు ఒకే రసాయన నిర్మాణం, భౌతిక లక్షణాలను కలిగి వుంటాయి. అధునాతన పరీక్షల ద్వారానే రెడీమేడ్ వాటిని తెలుసుకోగలరు.

పెంపుడు జంతువుల కార్బన్‌లను సేకరించి నాణ్యమైన వజ్రాన్ని లైఫ్ జెమ్ పేరిట తయారు చేస్తున్నారు.



వజ్రాలను మొట్టమొదట కనుగొన్నది భారత్‌లోని గోల్కొండ ప్రాంతంలోని ఇసుక మేటల్లో. 4000 సంవత్సరాల క్రితమే వీటిని అక్కడ కనుగొన్నారు.

నిజానికి వజ్రాలు ఖరీదైనవి కావు. వాటి సేకరణ పరిశ్రమ నియంత్రణలో వాటి విడుదల ఆధారపడడం వల్ల అవి ఖరీదైనవిగా మారాయి.

ఇప్పుడు మనకు లభించే వజ్రాలు మూడు బిలియన్ సంవత్సరాల క్రితం భూగర్భంలోని అత్యధిక పీడనంలో 900-1300 సెల్సియస్ వేడి వద్ద తయారయ్యాయి.



ప్రపంచంలోని ప్రసిద్ధి పొందిన వజ్రాల నిల్వలు బోస్టన్, రెషియా, కెనడాల్లో ఉన్నాయి.



వజ్రం, బొగ్గు రెండూ కార్బన్ అనే మూలకంతో ఏర్పడినవే.

ఇలా ప్రేమించాలి.. ఇలా పెళ్లి చేసుకోవాలి.. ఇలా ప్రేమ పెళ్లి యాత్రలో మైమరిచిపోవాలి. ఏకాంతంలో లోకం నిలిచిపోవాలి. అంటూ జెరెమీ, రేచల్ స్కాట్లాండ్‌లో ఓ సాహస యాత్ర చేస్తూ ఎడ్వెంచర్ ప్రేమ పెళ్లి చేసుకున్నారు. కళ్యాణ తంతు కన్నా దాంపత్య జీవితానికే పెద్ద పీట వేశారు. గమ్యస్థానాల కన్నా ప్రయాణానికే గొప్ప స్థానాన్నిచ్చారు. ప్రతి మజిలీని ప్రేమకు గుర్తుగా మలుచుకుని వెడ్డింగ్ ఆల్బమ్‌ను నింపేశారు. ఖరీదైన సంప్రదాయ కళ్యాణ వైభోగాన్ని కాదనుకుని వెలకట్టలేని ప్రేమ పెళ్లి యాత్రకు చేతిలో చేయేసుకుని బయలుదేరారు మనువాడే వేదికను వెదుక్కుంటూ.



జెరెమీ, రేచల్ కూడా మిత్రుల్లానే తమ పెళ్లికి హంగు ఆర్భాటాల లిస్టును వేసుకుందామని కూర్చున్నారు. కానీ అంత డబ్బు తగలేసి ఆ ఒక్క పూట ఖర్చు చేసే కన్నా... జీవితాంతం గుర్తుండి పోయే యాత్ర చేసేద్దామని డిసైడ్ అయిపోయారు. గెస్ట్ లిస్ట్ పక్కన పెట్టేసి రూట్ మ్యాప్ చేత బట్టుకున్నారు. ఓ మాంచి డిజైనర్ దగ్గర ఓ కాస్ట్‌లీ వెడ్డింగ్ గౌన్ ఆర్డరిచ్చే బదులు ఉన్న బట్టల్ని ఓ బ్యాగ్‌లో సర్దుకున్నారు. భారీ వెడ్డింగ్ కేక్ ముఖాల మీద విసిరేలా వేస్ట్ చేయడమెందుకని దారి ఖర్చులకు డబ్బులు మిగుల్చుకున్నారు. పెళ్లి మంత్రాలు చదివే వాడికి వేలు సమర్పించుకునే బదులు స్పాట్‌ల గుట్టు చెప్పే గైడ్‌కు పెర్కలివ్వాలని మనసు మార్చుకున్నారు. పొడవాటి లిమో ఖర్చు ట్యాక్సీలకు.. ఇలా ఒక్కో అనవసరపు ఖర్చును మరో యాత్రా అవసరానికి మరల్చేసుకున్నారు. కుటుంబ పెద్దలు, సన్నిహితులు అరే సంప్రదాయ పద్ధతిలో పెళ్లి కళే వేరని ఎంత బుర్ర తిన్నా.. తమ యాత్రా కలను మాత్రం పక్కన పెట్టేయలేదు. మరి రింగ్‌లు మార్చుకునే మాటేంటని అడిగితే.. తమ దారెంట ఎక్కడ ప్రకృతి పరవశించి ముగ్గుల్ని చేస్తే అక్కడ ఏకమైపోతామని అదే వారి వివాహ బంధాన్ని రిజిష్టర్ చేసే వేదికని ఒకరి తలను ఒకరి తలకు ఆనించి మరీ కలసి పెద్దోళ్లకు చెప్పేశారు.

ప్రేమ.. పెళ్లి... యాత్ర

కెనడాలోని ఒంటారియోకి చెందిన ఈ జంటకు.. పచ్చటి ప్రకృతికి మంచు వర్షంతో తెరలు కట్టే ఐస్‌ల్యాండ్ అద్భుత లోకంపై ప్రేమ పొంగింది. హైస్కూల్ రోజుల నుంచే ప్రేమలో పడిన రేచల్, జెరెమీలు కలసి ప్రేమించిన పర్యాటక ప్రాంతమది.



రేచలే చల్ చలో అంది..

జెరెమీకి ఇంత ఆలోచన లేదు. ఇద్దరు కలసి కూర్చుని పెళ్లి కార్యక్రమాల గురించి మాట్లాడుకునేటపుడు ఇలా చేస్తే ఎలా ఉంటుంది.. అలా చేసుకుంటే ఎలా ఉంటుందంటూ కాసేపు చర్చ జరిగింది. ఆ తర్వాత నిశ్శబ్దం ఆవరించింది. జెరెమీ ఏదో ఆలోచిస్తుండగా రేచెల్ ఐడియా అంటూ గట్టిగా అరిచింది. దెబ్బకు తుళ్లిపడిన జెరెమీ తడబడుతూ ఏంటా ఐడియా అన్నాడు. ఐస్‌ల్యాండ్ అంతటా చుట్టొస్తూ సింపుల్‌గా రింగ్‌లు మార్చేసుకుంటే ఎలా ఉంటుందంటూ మెరిసే కళ్లతో చెప్పింది. ఆ ఐడియా జెరెమీకి తెగ నచ్చేసింది. మరి యాత్రకు ప్లాన్ చేసుకుందామా? ఏ ఫ్లైట్స్ బుక్ చేయమంటావ్? లేదా ట్రైన్ టికెట్లు రిజర్వేషన్ చేయించనా అన్నాడు జెరెమీ. అలా వద్దంది రేచల్. ఏదో సందర్శన స్థలాల్ని చూసే సంపూర్ణ దేశ యాత్రలా వద్దు. ఏ ప్లాన్‌లు వద్దు. ఫ్లైట్‌లు, ట్రయిన్లన్న మాటే వద్దు. ఓ వ్యాన్‌లో చాలా సింపుల్ సామానుతో ప్రయాణం చేసేద్దాం.

స్పాట్స్ కన్నా ముఖ్యం ప్రయాణం.. అసలైన అనుభూతుల్ని మిగిల్చేదదే అంటూ జెరెమీకి నచ్చజెప్పింది. తొలుత ఇంటి పెద్దల్ని ఒప్పించడం చాలా కష్టమైంది. తర్వాత కొన్ని వారాలకు అందరూ సరే మీ ఇష్టమని అన్నారు. అంతే ఏ ప్లాన్‌లు లేకుండా ప్రయాణం కట్టేశారు ఆ ప్రేమికులు. వ్యాన్‌లోనే అన్ని ఏర్పాట్లు చేసుకుని నిద్రలు అందులో చేశారు. వీలు చిక్కినప్పుడల్లా అక్కడక్కడా గుడారాల్ని వేసుకుని గడిపారు. స్కాట్లాండ్ ఎందుకంటే అక్కడి అద్భుత ప్రకృతి రమణీయతలో మనసులు తప్పిపోతాయి. ఒక్కరే వెళితే తిరిగి వచ్చేది ఖాళీ హృదయాలే. మనసంతా అక్కడక్కడే తిరుగుతుంది. అదే ఓ జంట వెళితే ఇరు హృదయాలు ఆ విశాల హిమ సీమల్లోకి చేతులు కలిపి పారిపోతాయి. ఒంటరైపోతాయి. ఆ ఒంటరితనంలో ఏకాంతంలో మరింత దగ్గరవుతాయి. మరింత బలంగా ఒక్కటవుతాయి. ఇదంతా రేచల్ ఆలోచించి చేసిందో లేదో తెలీదు. కానీ, ఆమె తీసుకున్న నిర్ణయం వారి ప్రేమకు బలాన్ని పెంచింది. బంధానికి మరింత బరువునిచ్చింది. స్కాట్లాండ్ అంతటా వ్యాన్‌లో చక్కర్లు కొట్టిన ఆ జంట హిమానీ నదాలపై సాహసోపేతమైన ట్రెక్కింగ్ చేసింది. ప్రియురాలిని కాపాడుకోవాలని ప్రియుడు, కాబోయే భర్తకు కష్టం కలిగిస్తున్నానని ఫియాన్సీ తెగ నలిగిపోయారు. ఒకరిపై ఒకరికున్న ప్రేమ వారు తీసుకునే కేర్‌లో కనిపించే సరికి సంతోషంతో కన్నీటి బిందువులు జారి చలికి గడ్డకట్టాయి. అవి ముత్యాల్లా కనిపించాయిద్దరికీ. ఆ తర్వాత జలపాతాల వద్ద ఇద్దరూ ఏకాంత స్నానాలు చేశారు. ఈ ప్రపంచమంతా వారి కోసమేనన్నట్టు ఊహల్లో తేలిపోయారు. నాచు పట్టిన పచ్చని మోస్ క్షేత్రాల్ని కళ్లార్పకుండా చూశారు. పర్వత కోనల్లో వంకర్లు పోయిన పల్లె సీమల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో గుర్రాలపై కళ్లేలు లేకుండా విహరించారు. మంచులోకంలో సేద తీర్చే వేడి నీటి చెలమల్లో తానాలాడారు. చలి కాస్తోన్న వాటి ఒడ్డున కాలం మరిచి నిదురపోయారు.



పెళ్లి వేదిక దొరికింది...

ప్రతి చోటూ వారు మనువాడేందుకు వేదికలానే తోచింది. కానీ విస్మయపరుస్తోన్న ప్రతి అందం మరోటి మిగిలే ఉంటుందనే హింట్‌నిస్తుండటంతో పెళ్లి తంతును మరో అద్భుత లొకేషన్‌కు వాయిదా వేసుకుంటూ పోయారు. ఒక రోజు ప్రయాణంలో వారికి ఓ శిథిలమైన చర్చి కంటబడింది. అది అగ్ని పర్వత ప్రాంతంలోనిది. అంతకు ముందు ఓ అగ్నిపర్వత విస్ఫోటనం వల్ల లావా ఆ ప్రాంతంలోని చాలా గ్రామాల్ని తుడిచిపెట్టేస్తే ఈ ఒక్క కట్టడం మాత్రం ఆనవాలును మిగుల్చుకుంది. లావా ప్రవాహం కూడా ఆ చర్చి చుట్టుతా ప్రవహించి వెళ్లింది. కొన్ని రోజులకు చల్లాబడ్డాక ఆ దృశ్యం అద్భుతంగా మారింది. చర్చికి చుట్టుతా అల్లుకుని వెళ్లిన దారి పడింది. వెంటనే వారిద్దరీ పెదాల నుంచి జారిన మాట 'ఇక్కడే పెళ్లి చేసేసుకుంటే!'. అంతే వెంటనే వ్యాన్ దిగి ఆ శిథిల చర్చి వద్దకు చేరుకున్నారు. ఒకరి కోసం ఒకరని బాస చేసుకున్నారు. ఉంగరాలు మార్చుకున్నారు. ప్రకృతి పెద్దగా.. పంచభూతాల సాక్షిగా.. పెళ్లి చేసుకున్నారు. ఆకాశం నుంచి కురుస్తున్న మంచు అక్షతలు జల్లేసింది. పక్కగా వెళుతున్న సెలయేటి ప్రవాహ హోరు శుభాకాంక్షలు చెప్పేసింది. ఇరువురి పెదాలు ప్రేమను ఇచ్చిపుచ్చుకున్నాక ఓ కౌగిలింత కొన్ని క్షణాల పాటు ప్రపంచాన్ని మాయం చేసింది. అంతే అప్పటి వరకు ప్రేమ జంట కాస్త నవ వధూవరులుగా.. పిలుపులో గారెట్ అనే ఇంటి పేరును కరెక్షన్ చేసుకుని మళ్లీ వ్యాన్ ఎక్కేశారు. మిగిలిపోయిన ప్రయాణానికి హనీమూన్ ట్యాగ్ తగిలించేశారు. సొంతూరుకు వేలాది మైళ్ల దూరంలో ఉన్న వాళ్లకు ఇంకా ఇంటి మీదకు ధ్యాస మళ్లలేదు. మళ్లా ఈ అవకాశం లేదన్నట్టు మరో మజిలీకి గేర్ మార్చారు. ఇలా ఏకాంతంగా కళ్యాణం జరిగాక ఇక తర్వాత యాత్రలోని అద్భుత క్షణాల్ని గుర్తు నిలుపుకునేందుకు ట్రాయ్ మోత్ అనే ఓ ఫొటోగ్రాఫర్‌ను కొంత దూరం వెంటేసుకెళ్లారు. ఆల్బమ్‌కు సరిపడా చిత్రాలు చేరిపోయాక అతడికి వీడ్కోలు చెప్పారు. ఐస్‌ల్యాండ్‌కు మాత్రం వీడ్కోలు చెప్పలేకపోయారు. రెండేళ్లయినా.. వారికి యోకుల్సర్లోన్‌లోని ఐస్‌బెర్గ్ బీచ్ దగ్గరలోని గ్లేసియల్ లగూన్ గుర్తొస్తోంది. కరిగిన హిమానీ నదపు నీటి మడుగులతో నిండిపోయిన ఆ ప్రాంతంలో కదలకుండా గంటల తరబడి హత్తుకుని నించున్నారు మరి. విక్‌లోని బ్లాక్ సాండ్ బీచ్ కళ్లలో మెదులుతోంది. ఎక్కడైనా తీరపు ఇసుక తెల్లగానో బంగారు ఛాయలోనో మెరిసిపోతే ఇక్కడ కారు చీకటి రంగులో పెయింట్ వేసినట్టు ఉంటుంది. సెల్జావాల్లాలోని పర్వతాలకు ఆనుకుని ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో ఈదులాడిన శబ్దం, కేరింతలు కొట్టిన హృదయపు చప్పుడు ఇంకా చెవుల్లో హమ్ అవుతూనే ఉంది. సెల్జాల్యాండ్‌ఫోస్‌లోని జలపాతపు జల్లుల తాకిడి ఇంకా మనసుకు తగులుతూనే ఉంది. ఐజాఫ్జాల్లాయోకుల్‌లోని లావా చల్లారిన భూమి నునువెచ్చని స్పర్శ ఇంకా తెలుస్తూనే ఉంది. విక్ ప్రాంతంలోని ద్వీపకల్ప గ్రామం డైర్హోలే సముద్ర తీరపు కొండ మీద ఆ సాయంకాలపు విహారపు తలపుల్లోకి జారిపోతూనే ఉంది. అందుకే తమ 5వ పెళ్లి రోజును మళ్లీ ఐస్‌ల్యాండ్ యాత్రలోనే చేసుకోవాలని ఇప్పుడు మాత్రం ముందే ప్లాన్ చేసుకుంటున్నారు. మళ్లీ ఇదివరకటి ప్రేమ జంటలా ఇద్దరూ కలసి పారిపోవడానికి.

-అనన్య ప్రసిద్ధ





ప్రపంచ దేశాలు జికా వైరస్‌కి మందు కనిపెట్టే పనిలో తలమునకలౌతుంటే బ్రెజిల్‌కి చెందిన సూపర్ మార్కెట్లలో దోమల కుట్టకుండా ఒంటికి రాసుకునే తైలాలు, క్రీముల అమ్మకాలు ఒక్కసారిగా 120 శాతానికి పెరిగిపోయాయి. దోమలను దూరంగా ఉంచేందుకు ఓ దుస్తుల కంపెనీకి ఒక ఆలోచన తట్టింది. దోమల మందును వస్త్రంలో చొప్పించి మరీ యాంటీ మస్కిటో దుస్తుల్ని తయారుచేస్తుందట. దోమలను దరి చేరనివ్వకుండా వాడే క్రీములు, తైలాలు మహా అయితే ఓ నాలుగైదు గంటలపాటు చర్మానికి రక్షణ కల్పిస్తాయి. అదే ఈ దుస్తులైతే ఎక్కువ సేపు రక్షణ కల్పిస్తాయని, 20 నుంచి 30 సార్లు ఉతికినా వాటి సహజత్వాన్ని కోల్పోవనేది వీరి ప్రచారం. వీటి కోసం ఎగబడటంతో ఆ దుస్తుల ధరను కూడా పెంచేసింది కంపెనీ. అయితే శాస్త్రీయంగా ఎలాంటి నిర్ధారణ లేకపోవడంతో ఈ ప్రచారాలన్నీ ఉత్తవేనన్నట్టు కొందరు పెదవి విరుస్తున్నారు.

PRODUTOS A BASE DE CITRONELA

జికా దుస్తులట!



పెద్ద మనసు



దొంగతనం చేస్తూ పట్టుబడితే ఎవ్వరైనా ఏం చేస్తారు. దేహ శుద్ధి చేసి పోలీసులకి పట్టిస్తారు. కానీ, మలేషియాలోని ఓ హైపర్ మార్కెట్‌లో దొంగతనం చేస్తూ పట్టుబడిన వ్యక్తిని తమ వద్దే ఉద్యోగం చేయమని కోరాడు ఆ స్టోర్ మేనేజర్ రియాజ్. దొంగతనానికొచ్చిన వ్యక్తికి ముగ్గురు పిల్లలు. దొంగతనం చేయబోయిన వ్యక్తి భార్య నిండుచూలాలు. కాన్పు కోసం ఆస్పత్రిలో చేర్పితే ఆమె కోమాలోకి వెళ్లింది. కటిక పేదరికంలో ఉన్న ఆ వ్యక్తి ఏం చేయాలో పాలుపోక బాధతో ఇంటికి తిరుగు ముఖం పట్టాడు. వెంట తీసుకెళ్లిన రెండేళ్ల కొడుకు ఆకలితో ఏడుస్తుంటే చూస్తుండలేకపోయాడు. ఏదన్నా కొందామంటే చేతిలో చిల్లి గవ్వ లేదు. ఇంతలో దారిన ఓ హైపర్ మార్కెట్ కనిపించింది. ఓ గంటసేపు అక్కడే కలియతిరిగాడు. చివరకు దొంగతనం చేసన్నా కొడుకు ఆకలి మంటను తీర్చాలని లోపలికి వెళ్లాడు. ఫుడ్ సెక్షన్‌లో ఉన్న యాపిల్స్, పియర్స్, డ్రింక్ బాటిల్స్‌ని దొంగిలించి వెళ్లిపోతూ సిబ్బందికి పట్టుబడ్డాడు. దెబ్బలు తింటే తిన్నాను.. బిడ్డ కడుపు చల్లారెదెలా అని కన్నీళ్లు పెట్టుకున్నాడు. తనా పని చేయడానికి కారణాన్ని స్టోర్ మేనేజర్‌తో చెప్పాడు. అతడి మాటల్లో, కళ్లలో నిజాయితీ ఉందని నమ్మిన మేనేజర్ పోలీసులకు అప్పజెప్పలేదు. జైలు శిక్షకి బదులు తన వద్దే ఉద్యోగం చేయమని పెద్ద మనసుతో హత్తుకున్నాడు. ఉద్యోగానికి సిద్ధమైనప్పుడే వచ్చి చేరొచ్చని, కుటుంబ అవసరాల కోసం కొంత డబ్బును కూడా ఇచ్చి పంపాడు.

వింత లోకం



వెర్రి సాహసాలు

సాహసాలు చేయడం ఇష్టమైతే కొన్ని సార్లు రికార్డు బద్దలకొట్టొచ్చు. అదే పిచ్చిగా మారితే? లాస్ ఏంజెల్స్‌కి చెందిన మైక్ హ్యూగ్స్ చేసిన సాహసాన్ని గురించి తెలుసుకుంటే మీరూ ఆ అభిప్రాయానికొస్తారు. ఆవిరితో పైకెగిరే 'రాకెట్ జంప్' ఎంతో సాహసోపేతమైన క్రీడ. ట్యాంకులో కూర్చుని గాల్లోకి ఎగిరాక తిరిగి నేలను తాకేలోగా ప్యారాచ్యూట్ సాయంతో ప్రాణాలతో బయటపడాలి. స్టీల్ ర్యాంపుకున్న రాకెట్ ట్యాంకును నీటి ఆవిరి ఒత్తిడి సర్రున తారాజువ్వలా గాల్లోకి విసిరేస్తుంది. ఎక్కడ తేడా వచ్చినా అంతే సంగతులు. ఇలా మైక్ గతంలోనే 1,374 అడుగుల రాకెట్ జంప్ చేసి రికార్డు సృష్టించాడు. సాహసాలు చేసే 'డేర్ డెవిల్స్‌కి' రాజుగా తనకు తానే ప్రకటించేసుకున్నాడు. ధైర్యం కొంచెం ఎక్కువైందేమో మరో అడుగు ముందుకేసి తన గత రికార్డును తిరగరాసేందుకు సన్నాహాలు ప్రారంభించాడు. ఈ సారి తానే స్వయంగా సొంత ఖర్చుతో 'ఎక్స్-2' స్టీమ్ రాకెట్‌ని టెక్సాస్‌లోని గ్రాండ్ కేన్యాన్ పార్క్‌లో సిద్ధం చేసుకున్నాడు.

ఎండలో పడి వస్తే చల్లటి నీళ్లు తాగందే మనకు దప్పిక తీరదు. ఇక ఇంటికి చుట్టాలో పక్కాలో వస్తే వెంటనే కూల్ డ్రింక్ బాటిల్ తెప్పించేస్తాం. లేదా జ్యూస్ అన్నా గ్లాసుల్లో ఒలికిస్తాం. కానీ చైనాలో ఆతిథ్యం వేడి నీటిని మూతికి అందిస్తూ మొదలవుతుంది. నీళ్లే కాదు అక్కడ చాలా వరకు పానీయాలన్నీ కాలంతో నిమిత్తం లేకుండా వెచ్చగా గొంతులో దిగాల్సిందే. ఈ అలవాటుకు కారణం దాదాపు 60 ఏళ్ల క్రితం చైనాలోని మంచినీళ్ల కుళాయిల్లో వచ్చే నీరు శుభ్రంగా ఉండేది కాదు. నీటిలో ఉత్పన్నమయ్యే క్రిములు పోయేందుకు నీటిని కాచేవారు. ప్రభుత్వమే ప్రజలకి వేడి నీళ్లను సప్లై చేసింది. పని ప్రదేశాల్లో బాయిలర్ గదులనీ ఏర్పాటు చేసింది. ఇప్పుడదే అలవాటుగా మారిపోయింది. ఉదయాన్నే ఇంటి ముందు పెట్టిన కంటెయినర్లలో వేడి నీళ్లు పోస్తారు. పరగడుపున వేడినీళ్లను తాగితే జీర్ణ వ్యవస్థ, రక్త ప్రసరణలు మెరుగవుతాయని అంటారు. స్థానికులు రెస్టారెంట్‌లలో అందించే తాగు నీరు చల్లారితే అంతెత్తున లేస్తే, విదేశీయులకు మాత్రం గుటక పడటం లేదట!

చైనా వారి చిట్కా



కాలం నది ఒడ్డున...

కాలం నది ఒడ్డున' కవితా సంపుటిని జస్టిస్.బి.చంద్రకుమార్ గారికి అంకితం చేశారు కవి బిక్కి కృష్ణ. 77 కవితలున్న ఈ సంపుటికి ప్రముఖ కవులు కె.శివారెడ్డి, డా.ఎన్.గోపి, నగ్నముని, శిఖామణి, డా.ప్రసాద మూర్తి, డా.యం.బి.డి శ్యామల, మల్లెమాల నరసింహామూర్తి ముందుమాటలు, పీఠికలు రాశారు. వారి కవితల్లో నిబద్ధత, స్థలకాలాల నేపథ్యం, సమూహ చైతన్యం, భావ చిత్రాల ప్రతీకలు, శబ్ద శిల్పసౌందర్యం, బలమైన వస్తు ప్రాధాన్యత, కలిగి ఉంటాయి. సృజనశీలత, సౌందర్యాత్మకమైంది. చాలా కవితల్లో ఈ వర్ణనాత్మకత (discription) గొప్పగా కనిపిస్తుంది. పండితులు చెప్పిన బిక్కి కృష్ణ కవిత్వానికి నర్మగర్భత లక్షణం పుష్కలంగా ఉంది. వసుధా విమర్శకుడు కావడంతో కప్పి చెప్పినప్పుడే కవిత్వం పండుతుందన్న సత్యాన్ని బాగా ఎరిగినవాడు.

కవి క్రాంతిదర్శిగా వుంటాడు. కృష్ణ కావ్య ప్రయోజనం కూడా తెల్సినవాడు... భారతీయతను ప్రతి పంక్తిలో చూపించేవాడు... "సంసార విషవృక్షస్య ద్వేఫలే అమృత తోపమే! కావ్యామృత రసాస్వాదః సల్లాపస్సుజ్జనైస్సహ" అన్నారు మన ప్రాచీన భారతీయ అలంకారీకులు. ఆనందోపదేశాలు రెండూ కావ్య ప్రయోజనాలే కదా "వాళ్ళనలా వదిలేయండి" అనే కవితలో బిక్కికృష్ణ రాసిన వాక్యాలు మనసున్న వారిని కదిలిస్తాయి.

"మీరు వడ్లగింజ వేయాల్సింది బోసి నవ్వుల నోట్లోకాదు!

కార్పొరేట్ ఆస్పత్రుల్లో కడుపుల్లో ప్లాస్టిక్ చేతులు దూర్చి

రహస్యంగా ఆడపిండాలను చిదిమే రాకాసి నోట్లో...

తల్లుల్లారా! వడ్లగింజల రూపాలతో పసి గొంతులు కోయకండి!

ఎందుకంటే...అది వారి కంఠాలను కరకరా కోస్తున్నప్పుడు బాధలో

విప్పారిన పసికూనలు రెప్పల మధ్య ఉప్పెనగా ఎగసిపడే కన్నీటి కడలి హోరులో

ఈ భూగోళం కనుగ్రుడ్డు కొట్టుకుపోక ముందే... వారినలా వదిలేయండి!

పై కవిత 2014లో "నాటా" వారి బహుమతి పొందింది. ఈ కవి విద్యార్థి దశలోనే వామపక్ష వాద దృక్పథం కలిగి వుండటంతో ప్రపంచ పరిణామాలపై-సామ్రాజ్య వాదంపై... స్పష్టమైన అవగాహన వుంది అని తేటతెల్లం చేసే కవిత "కవులు-సముద్రాలు... అక్షుశాలు"?. కవి భావుకత-విప్లవ దృక్పథం ప్రసంసనీయం..."అడవి పిల్లలను-అనాగరిక యువకులను పులులుగా మార్చిన ఆఫ్రికన్ కవుల అక్షరాలంటే ఇష్టం.

సామ్రాజ్యవాద ముష్కరమూకల ఉక్కు సౌధాలను/ అక్షర ఫిరంగులతో పేల్చివేసిన లాటిన్ అమెరికన్ నాకు నెరూడా ఇష్టం-గోర్కి ఇష్టం-చెకోవ్ ఇష్టం/ రచయితలంటే ఇష్టం-దేవుడు చర్చిలో కాదు ప్రకృతిలో ఉన్నాడన్న వాల్ట్‌విట్ అంటే ఇష్టం. శ్రీశ్రీ ఇష్టం-శివసాగర్ ఇష్టం-ప్రపంచీకరణను వ్యతిరేకించే 'కవే' నిజమైన ప్రజాకవిగా కీర్తించబడతాడు- "కర్షక కవి రాసిన పొలం కావ్యం"లో కవి అంతరంగాన్ని అర్థం

కాలం నది ఒడ్డున
రచయిత: బిక్కి కృష్ణ
పేజీలు:180
వెల:100/-
ప్రతులకు: బిక్కి చందన
867/5, బ్లాక్ నెం:5, ప్లాట్ 5. స్ట్రీట్ నెం:15, సుందరయ్య పార్క్ వద్ద, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-44
సెల్:9912738815

చేసుకోవాలి.

"ఇప్పుడు నీవు లేవు నీ నాగలి ఉంది.

నీ పొలం కావ్యానికి ప్రపంచీకరణ చెదలు పట్టాయి రైతన్నా!

ఆనాడు పొలంలోకి ఎక్కడ అడవి పందులు చొరబడతాయోనని

బెంగతో కంచెను వేసి రేయి పగలు పొలానికి కాపలా ఉన్నావు

నేడు పల్లెల పొలాలపై గ్లోబల్ రాబందులు వాలాయి కదా!

లంచాలకు అవినీతి అమ్ముడుబోయిన నాయకులున్న చోట

పొలానికే కాదు దేశానికి కూడా కంచె వేసినా ప్రయోజనం లేదు అంటారు.

"కాల్పనిక జగత్తులో విహరించే వాడు కవికాదు-కన్నీళ్ళని విప్లవీకరించే వాడు కవి" అంటారు విప్లవకవి చెరబండ రాజు. చాలా కవితల్లో కష్టజీవుల ఆక్రోశాన్ని ఆక్రమించాడు బిక్కి కృష్ణ.

ఇతర భాషల్లోకి అనువదించాల్సిన అద్భుత కవిత "భూగోళం కనుగుడ్డుపై అరుణోదయం" కవిత కవి శక్తివంతమైన భావజాలంతో ఓ చోట ఇలా అంటారు.

"గాట్ ఒప్పందాల నక్కల కుట్రలకు చిన్న దేశాల కోళ్లు అదృశ్యమయ్యాయి

మల్టీనేషనల్ కంపెనీల ఎరువులొచ్చి చేలల్లో వానపాముల్ని చంపేసినట్టు!

బడాబడా కంపెనీల బకాసుర హస్తాలు చిల్లర వ్యాపారుల పీకలు నలిపేశాయి.

.... ప్రపంచీకరణ తిమింగలం దేశాలను, రాష్ట్రాలను, నగరాలను, పల్లెలను మింగేసింది. ఇదే కవితలో మరో చోట.... కవి గ్రామసీమల్ని దృశ్యీకరణ చేస్తారు. వెంటాడే వాక్యాలు చూడండి "రైతుల పొలాల్లోకి సెజ్‌ల అడవి పందులు దూరి నేల తల్లిని కురూపిని చేశాయి! చేనేత మగ్గం చెలికాణ్ణి మరమగ్గం విలుకాడు చేతులిరిచినట్టు-కుల వృత్తుల పనిముట్లు సౌందర్య చిత్రాలను గ్లోబల్ మార్కెట్ రక్కసి చెరిపేసింది.-విదేశీ మద్యం పర్మిట్ల వడిసెల దెబ్బలకు! తాటి చెట్టుపై గీసిన ఈత కల్లు కుండ పగిలిపోయింది. ప్రపంచీకరణ పెనుతుఫాను దాడికి! ఉపాధి కోల్పోయిన పేదల గుండెలు ఆగిపోయాయి" అంటాడు.

ఆంగ్ల కవితా పితామహుడు బేకన్ అన్నట్లుగా "అన్ని భాషల్లోకి అనువదించడానికి సాధ్యంకానిదే గొప్పకవిత". అలాంటి కవితల పూల సజ్జ ఇది. ఈ సంపుటిలో ఎన్నో విలువైన వాక్యాలు వున్నాయి. ఉదా: -"కరువు.....పల్లెకు చెరువుకు ఉన్న కలువ పేగుబంధాన్ని పుటుక్కున తెంచింది!"

"జొన్న రొట్టెపై ఎర్రగారం ..... తెల్లని ఆకాశంలో అరుణ బింబంలా!"

"చెరువు గురించి మాట్లాడటమంటే చనిపోయిన మా అమ్మ గురించి మాట్లాడడం"

"మార్కెట్ కవులు/ మబ్బుల్లా తేలిపోతారులే! మనసున్న కవులు మాత్రమే సూర్యోదయాలుగా మిగిలిపోతారులే!

రాయలసీమ కరువును-కోస్తా భూస్వామ్య దోపిడీని ....తెలంగాణ పసితనపు స్వచ్ఛ మనస్సును బానిస బంధ విముక్తిని, అక్షరీకరించి చైతన్య పరిచిన బిక్కి కృష్ణ కవిత్వాల విప్లవోద్యమ సాహిత్యానికి ఓ ప్రత్యేక డిక్షన్-మరిన్ని మంచి కవితా... సంపుటాలు వీరి లేఖిని విరచించాలి"

- తంగిరాల చక్రవర్తి

పరిచయం

బుర్రలకో బ్యాంకు

బ్రాంక్స్‌లోని జేమ్స్ జె.పీటర్స్ వీఏ వైద్య కేంద్రంలోని మౌంట్ సినాయ్ ఎన్ఐహెచ్ మెదడు, కణజాల రిపాజిటరీకి డైరెక్టర్ వాహ్రామ్. బ్రెయిన్ బ్యాంకుగా పిలిచే ఈ ల్యాబ్‌లో మెదడు పనితీరు, మానసిక రుగ్మతలు, కణజాల వ్యాధులకు సంబంధించి పరిశోధనలు సాగిస్తారు. ముందే ప్రత్యేక వైద్య కేసులున్న దాతల్ని గుర్తించి వారికి నచ్చజెప్పి న్యూరో బయో బ్యాంక్ ద్వారా రిక్వెస్ట్‌లు తీసుకుంటారు. వ్యక్తి మరణించాక కుటుంబ సభ్యుల అంగీకారంతో మెదడును సేకరించి బ్రెయిన్ బ్యాంకుకు తరలిస్తారు. అస్సలు పాడవకుండా చాలా జాగ్రత్తగా 12 ఫ్రీజర్‌లలో వేయికి పైగా మెదళ్లను భద్రపరిచారు. ఒక్కో ఫ్రిజ్‌లో 100 మంది దాతల మెదళ్లు ఉంటాయి. కేవలం అమెరికాలోని శాస్త్రవేత్తలకే కాక ప్రపంచవ్యాప్తంగా ఉన్న వైద్య నిపుణుల పరిశోధనలకు ఈ బ్రెయిన్ బ్యాంకు ఉపయోగపడుతోంది. కొందరు శాస్త్రవేత్తలు మెదడులోని ఓ భాగానికి సంబంధించిన 15 వేలకు పైగా శాంపిళ్లను అడుగుతారు. అప్పుడు బ్రాంక్స్‌లో ఉన్న ఈ రిపాజిటరీతో పాటు ప్రపంచంలో ఉన్న మిగతా బ్రెయిన్ బ్యాంకుల సహకారంతో వారికి సాధ్యమైనన్ని శాంపిళ్లను అందిస్తారు. డాక్టర్ వాహ్రామ్ ఈ బ్రెయిన్ బ్యాంకులో 34 ఏళ్లుగా పనిచేస్తున్నారు. అంతకు ముందు ఆ బ్యాంకు అల్జీమర్స్ పరిశోధన కేంద్రంగా ఉండేది. అప్పట్లో

డాక్టర్ వాహ్రామ్ హరౌటునియన్ ల్యాబ్‌కు వెళ్లారంటే మీరు వేయి మంది బుర్రల మధ్య తిరుగుతున్నారన్న మాట. అక్కడన్నీ టప్పర్ వేర్ డబ్బాలే కనిపిస్తాయి. వాటి మూతల్ని జాగ్రత్తగా తెరిచి ఆయన మీకు చూపిస్తే అందులో మీకు ఓ డజన్ మనిషి మెదడు స్లైస్‌లు తాజాగా గులాబీ రంగులో కనిపిస్తాయి. ఇబ్బంది పడకండి, జ్వరం తెచ్చుకోకండి అవన్నీ కూడా పరిశోధనలకు సేకరించినవే.



రోగుల వ్యాధి లక్షణాలను బట్టే వైద్యం చేస్తుండే వాళ్ళు కానీ మెదడు నిర్మాణం, పనితీరును నేరుగా పరిశీలించే అవకాశం ఉండేది కాదు. ఈ సమస్యకు పరిష్కారంగానే వాహ్రామ్‌కు బ్రెయిన్ బ్యాంకు ఆలోచన వచ్చింది. వైద్య కేసులవే కాకుండా ఆరోగ్యవంతమైన వ్యక్తుల మెదళ్లను కూడా సేకరిస్తున్నారు. బ్రెయిన్ బ్యాంకులోని ఓ గదిలో అచ్చు ఓ సైన్స్ ఫిక్షన్ సినిమాలోని సీన్ మాదిరిగా మెదళ్లు భద్రపరిచిన గాజు సీసాలు వరసగా బారులు కట్టి ఉంటాయి. ఫార్మాలిన్ ద్రావణంలో మెదళ్లను ఉంచుతారు. సున్నితమైన మెదడు కణజాలం దెబ్బతినకపోవడమే కాకుండా స్పష్టంగా మెదడు మీద పొరలు కనిపిస్తాయి. వివిధ శరీర భాగాలను కూడా ఇలానే భద్రపరిచే అవయవ బ్యాంకులకు భిన్నంగా ఇక్కడ దాతల పేర్లు వివరాల పట్టికను ఉంచరు. కేవలం స్పెసిమెన్స్ అని రాసిస్తారు. మెదడును దాత శరీరం నుంచి సేకరించడం అంత తేలికేం కాదు. మెదడు అంటే మిగతా అవయవాల్లా కాదు.. జ్ఞాపకాలు, వ్యక్తిత్వంతో ముడిపడి ఉండేది. చాలా మంది అందుకే మెదడు దానానికి అంతగా ముందుకు రారు. మరో సమస్యేంటంటే మృతుడి శరీరం నుంచి మెదడును చాలా త్వరగా సేకరించాల్సి ఉంటుంది. 48 గంటల తర్వాత చూస్తే మెదడు కణాల్లోని ప్రొటీన్ కనిపించదు. అందుకే దూరాల నుంచి వచ్చే వాటిని ఓ ఐస్ బాక్స్‌లో ఉంచి సాధ్యమైనంత వేగంగా ల్యాబ్‌కు చేరుస్తారు. సేకరించిన మెదడులోని ఎడమ, కుడి భాగాలను వేరుచేస్తారు. కుడి భాగాన్ని స్లైస్‌లుగా కోసి గాజు సీసాల్లో వేస్తారు. వీటిని అనాటమీకి ఉపయోగిస్తారు. ఎడమ భాగం మొత్తాన్ని ద్రవ నత్రజనిలో స్నాప్-ఫ్రోజ్ (గడ్డకట్టించుట) చేస్తారు. తర్వాతి అవసరాలకు ఉపయోగిస్తారు. హిప్పోక్యాంపస్, ప్రీఫ్రాంటల్ కార్టెక్స్ భాగాల్ని ప్లాస్టిక్ కవర్లలో చుట్టి వేరుగా భద్రపరుస్తారు. ఇక్కడి మెదళ్లల్లో 1983లో సేకరించినది ఉంది. ఇప్పటికీ దాన్ని పరిశోధనలకు వాడుతున్నారు. ప్రస్తుతం ల్యాబ్‌లో స్కిజోఫ్రీనియా రోగుల మెదళ్ల నాడీ పొరలల్లోని ఓ జన్యువు అనామోలీపై పరిశోధన సాగిస్తున్నారు. చూడటానికి ఆరోగ్యవంతమైన వ్యక్తి మెదడుకు, స్కిజోఫ్రీనియా రోగి మెదడుకు తేడా ఏం కనిపించదు. జన్యువుల ప్రవర్తనలోని మార్పులను పరిశీలించడం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం కనుగొనవచ్చునేది బ్రెయిన్ బ్యాంకు బృందం ఆలోచన. ఇలాంటి ఎన్నో పరిశోధనలకు స్పెసిమెన్స్‌ను అందిస్తున్న ఈ బ్రెయిన్ బ్యాంకులు పరిశోధనలకు చాలా కీలకం. వచ్చే 30 ఏళ్లలో బ్రెయిన్ బ్యాంకుల వల్ల వైద్య రంగంలో అనేక సంచలనాలు నమోదవుతాయనేది వాహ్రామ్ అంచనా.

మనుస్మృతి రాజ్యం

సూర్యుడు వేడెక్కుతున్నాడు
గుక్కెడు నీళ్ళు లేని ఊళ్ళు
నెర్రెలిస్తున్న బీళ్ళు
ఎండిన వాగులు, నదీనదాలు
మయసభ కట్టేనాడు
మూలవాసుల భూములు ఆక్రమించాడు ధర్మరాజు
న్యాయం అడిగినందుకు
చార్వాకుణ్ణి ఉరితీశాడు
ప్రతినగరం గర్భంలో ఎన్నో తెగిన తలలు
రాజ్యం అంటే దురాక్రమణా!
ప్రభుత్వం అంటే అణిచివేసే అస్త్రమా!
కన్నీరు కనుకొలల్లోనే ఎండిపోతున్నాయి
కామవ్యామోహితులు
రోడ్ల మూలాలలో నక్కి ఉంటున్నారు
ఉదయకాలాన్నే ఉన్మత్తులవుతున్నారు
ఇక వివేచనకు దారేది?
ఆ ముదుసలి గొంతెండి మరణించింది
ఆ ప్రభువు విమాన విహారాల్లో
ఇంద్రలోకాలు చూస్తున్నాడు
మోసం ఓ వ్యసనం అయ్యింది సుమా..!
బోకరింపులకు నాలుగు గొంతులు సానపెట్టారు
దళితుల తాతలుముత్తాలనాటి
భూములను దురాక్రమణ చేయడం
మా హక్కు అంటున్నారు
మాట్లాడే గొంతులు నొక్కుతున్నారు
బడా బాబులు బ్యాంకులకు
వేల కోట్లు ఎగవేస్తే
అమూల్య పదవులిచ్చి సత్కరిస్తున్నారు
మేథావులు నాలుగు రూపాయలకు
అమ్ముడుపోయి
వారికి బాకాలూదుతున్నారు
సత్యవాక్యం ఎప్పుడూ
అగాథాల్లో నుండే పలుకుతోంది
నెత్తురోడుతున్న రాస్తా
చీరిన వంటికి సాక్ష్యం చూపుతుంది
దళారులు అవార్డుల కోసం
ప్రభుత్వం కాళ్ళ దగ్గర మోకరిల్లుతున్నారు
పుత్రికా, పుత్రికలకు 'తొత్తుశాస్త్రం' బోధిస్తున్నారు
వాడు కార్పోరేట్ వ్యవస్థను నిర్మించి
ప్రాథమిక విద్యను బుల్డోజర్లతో తొక్కించాడు
ప్రజల ముఖం చూడకుండానే
అమాత్యవరుడయ్యాడు
మానవజాతికి మచ్చతెచ్చే
దుశ్చర్యులంతా పాలకులవుతున్నారు
ఒకడు రోడ్లు ఊడవండీ అంటున్నాడు
మనుస్సులు మురికి కుంటలయినా!
వివక్ష మెదడులో గూడు గట్టినా!
రోడ్లలో చెత్త వూడిస్తే సరిపోద్దంటున్నాడు
మనస్సులను శుభ్రం చేసే
బోధనలను తునుమాడుతున్నాడు
గొంతులో నుండి వచ్చే
హిందువాదజ్వలనం
మేథావులను దగ్ధం చేస్తుంది
ఆత్మహత్య చేసుకోవడం
అతని కర్మ అంటున్నాడు
మనుస్మృతిని కొత్తభాషలో ఘోషిస్తున్న
స్మృతిఇరాని పార్లమెంటును
తన హావభావాలతో మోహనం చేస్తుంది
శబ్దజాలాన్ని బట్టి 'దేశద్రోహ'
నేరాన్ని నిర్వచిస్తుంది
గంగా, యమునా నదీ పరీవాహాలను
రక్తసిక్తం చేసిన ఉన్మాదాన్ని
దేశభక్తిగా కీర్తిస్తుంది
'జీవించడం అంటే హిందువు'గా జీవించడం
రామ భజనలో జీవించడం
పరశురాముని గొడ్డలి ధరించి జీవించడం
శివుని శూలం చేతబూని జీవించడం' అంటుంది
'జీవించడం అంటే జ్ఞానంతో జీవించడం
జీవించడం అంటే మనిషిగా జీవించడం
అని వేముల రోహిత్ లేఖ' చెబుతోంది
స్మృతిఇరానీ అంటే అంబేద్కర్ అక్షరాలు
ఎప్పుడైనా నోట పలికిందా..!
బుద్ధుడు, అంబేద్కర్, పూలే
స్త్రీల విముక్తి దాతలు
ఈ కథ ఈ మనుస్మృతి వనితకు తెలియదు
నిజానికి! నోరునొక్కడం అంటే
భారత రాజ్యాంగాన్ని తూట్లు పొడవడమే
తమ కాళ్ళ కింద భూమిని తవ్వుకోవడమే
అవును! అంబేద్కర్ వారసులు
వేలగొంతులతో ధ్వనిస్తున్నారు
ఆకాశ నక్షత్రాలు
మళ్ళీ సాంస్కృతిక విప్లవ వెలుగులు
విరజిమ్ముతున్నాయి
మూలవాసుల డప్పునాదం వినిపిస్తుంది
తెల్లవారుజామునే ఒకపక్షి
స్వేచ్ఛోదయ గీతం పాడుతోంది!
యుగసందేశం వినిపిస్తోంది
చరిత్ర మళ్ళీ మళ్ళీ తిరిగి పునరుజ్జీవనం

- డాక్టర్ కత్తి పద్మారావు

కథ



రుణ మాఫియా!

దినవహి సత్యవతి

044 4957 8302

అది ఒక బ్యాంకు రైతులకు పంట రుణాలు ఇవ్వటం పొదుపు ఖాతాలు నిర్వహించటం వంటి సౌకర్యాలు ఉన్నాయి అందులో.. సత్యం ఈ మధ్యనే ఆ బ్యాంకులో ప్యూన్‌గా చేరాడు. అతని తండ్రి విధి నిర్వహణలో మరణించటం చేత ఆ ఉద్యోగం డిగ్రీ పూర్తి చేసిన సత్యానికి ఇవ్వటం జరిగింది. తండ్రి గుణాలు పుణికి పుచ్చుకున్న సత్యం కూడా అంతే నిజాయితీపరుడు, ఎంతో నెమ్మదస్తుడు కూడా. అనతి కాలంలోనే బ్యాంకులో అందరి నుంచి బుద్ధిమంతుడు అని కితాబు సంపాదించుకున్నాడు.

కొన్ని నియమాలను అనుసరించి పాత రుణాలు కొంత వరకు మాఫీ చేసి రైతులకు తిరిగి కొత్త రుణాలు మంజూరు చేస్తున్నారనే ప్రకటన వెలువడంతో ఆ వేళ బ్యాంకు అంతా రుణమాఫీ కోసం కొత్త రుణం కోసం వచ్చిన రైతులతో కిక్కిరిసి ఉంది. పని ఎక్కువగా ఉండటంతో అటూ-ఇటూ ఫైల్స్ మోస్తూ వాళ్ళని చూసి మా గ్రామంలో ఇంతమంది రైతులు ఉన్నారా అనుకుని ఆశ్చర్యపోయాడు సత్యం.

పనిలో పని నిశ్శితంగా అందరిని గమనిస్తున్నాడు. సత్యానిది డిటెక్టివ్ స్వభావం. దానికి తోడు జ్ఞాపకశక్తి కూడా మెండు.

"దురదృష్టవశాత్తు నాన్న చనిపోవడంతో ఇంటి బాధ్యతలు మీదపడి ఈ ఉద్యోగంలో చేరాల్సి వచ్చింది. లేకపోతేనా ఎంచక్కా డిటెక్టివ్‌ని అయ్యుండే వాడిని.." అని అనుకుంటాడు అప్పుడప్పుడు.

కొత్త రుణం తీసుకోవటానికి కౌంటరు దగ్గర వరుసలో అందరికంటే ముందుగా నిలబడి ఉన్న వ్యక్తిని ఎక్కడో చూసినట్లుగా అనిపించటంతో ఎవరా అని ఆలోచిస్తుంటే తట్టింది. "అరే! ఈయన రాజశేఖరం గారు. ఈయన మోతుబరి రైతేనే మరి ఈయనకెందుకో పంట రుణం." అనుకున్నాడు సత్యం. రాజశేఖరం గారికి ఈ మధ్యనే ఒక లక్ష రూపాయల దాకా రుణ మాఫీ కూడా లభించిందని బ్యాంకులో చెప్పుకుంటుంటే తెలిసింది సత్యానికి. అప్పుడప్పుడు కాగితాలు ఒక కౌంటర్ నుంచి ఇంకో కౌంటర్‌కి బదలీ చేసేటప్పుడు కొంత యథాలాపంగానూ, కొంత డిటెక్టివ్ బుద్ధి తాలుకు ఆసక్తితోను వాటిలోని విషయాన్ని చదివేసి బుర్రలోకి ఎక్కించేసుకుంటాడు సత్యం. అందువల్లనే బ్యాంకులో జరిగే చాలా విషయాలు తెలుసు అతనికి.

విషయ సేకరణ తప్పు కాదు గాని, దానిని వక్ర మార్గంలో వినియోగించటమే తప్పు అని నమ్ముతాడు సత్యం. తాను ఇలా చదువుతున్నాడని ఎవరైనా కనిపెడితే తన ఉద్యోగం ఊడిపోవటం ఖాయమని తెలుసు. అందుకే తగు జాగ్రత్తలోనే ఉంటాడు. ఒకవేళ ఏదైనా విషయం ఆసక్తికరంగా అనిపిస్తే మాత్రం ముందుగా బుర్రలోకి ఎక్కించేసి ఇంటికి వెళ్ళి ఒక పుస్తకంలో రాసి దానిని ఎవరికంటా పడకుండా రహస్యంగా భద్రపరిచేసుకుంటాడు.

భాస్కర్ కూర్చున్న కౌంటర్‌లో మేనేజరు గారు ఇవ్వమన్న కాగితం ఇద్దామని వచ్చిన సత్యానికి అక్కడ రాజశేఖరం గారు భాస్కర్ గుసగుసగా మాట్లాడుకుంటూ చెవులు కొరుక్కోవడం గమనించాడు.

ఏమై ఉంటుందో అయినా నాకెందుకులే అని అప్పటికి మనసు సమాధాన పరుచుకున్నాడు గానీ, అతని 'డిటెక్టివ్' బుర్రలో అంత రహస్యమేమిటా అనే అనుమానం కలగటంతో ఆ రాత్రి సత్యానికి నిద్ర పట్టలేదు.

మర్నాడు మళ్ళీ రాజశేఖరం రావటం భాస్కర్ నుంచి ఒక రుణ దరఖాస్తు తీసుకుని అక్కడే ఒక మూలగా నిలుచున్న కొంచెం పేదవాడుగా కనిపిస్తున్న రైతు దగ్గరికి వెళ్ళి దానిపై వాడితో వేలి ముద్ర వేయించి తిరిగి భాస్కర్‌కి ఇవ్వటం అంతా

గమనించాడు సత్యం. బ్యాంకు చాలా రద్దీగా ఉండటం వల్లనూ అన్ని కౌంటర్లలో వాళ్ళు తమ తమ పనిలో మునిగిపోయి ఉండటం వల్లనూ ఈ తతంగమంతా ఎవరూ గమనించినట్లు అనిపించలేదు సత్యానికి.

కొంచెం సేపటి తరువాత భాస్కర్ 'సత్యం ఇలారా' అని పిలిచాడు.

'ఇది మేనేజరు గారికి ఇవ్వు' అంటూ ఇందాకటి దరఖాస్తు చేతిలో పెట్టాడు.

'అలాగే సార్!!' అని ఆ దరఖాస్తు మేనేజరు గారి వద్దకు తీసుకెళుతూ అందులో ఏముందో చూస్తే.. అది ఆ పేద రైతు పేరున లక్ష రూపాయల రుణం కోరుతూ పెట్టిన దరఖాస్తు.

'ఓహో! ఇదన్న మాట సంగతీ! ఆ పేద రైతు చేత రుణానికి దరఖాస్తు పెట్టించి మంజూరు అయిన తరువాత ఆ డబ్బులు ఈ రాజశేఖరం గారు తీసుకుంటారన్న మాట!' దాంతో రాజశేఖరం, భాస్కర్ చెవులు కొరుక్కోవటం.. ఉదంతమంతా అర్థమైపోయింది సత్యానికి. వెంటనే ఆ దరఖాస్తు సంఖ్య బుర్రలోకి ఎక్కించేసి మేనేజరు గారికి ఆ కాగితం ఇచ్చి వచ్చేశాడు. ఆ సాయంత్రం ఇంటికి వెళ్ళి తన రహస్య పుస్తకంలో ఆ దరఖాస్తు సంఖ్య అవాళ్టి తారీఖు అన్నీ నమోదు చేశాడు. ఆ రోజు నుంచి తన పని చేస్తూనే భాస్కర్‌ని అతని వ్యవహారాన్ని మరింత నిశితంగ గమనించసాగాడు సత్యం.

ఇలా రోజూ ఎవరో ఒకరు రావటం.. భాస్కర్ దగ్గర నుంచి దరఖాస్తు తీసుకెళ్ళి ఆ గుంపులో కూర్చున్న ఒక పేద రైతుతో వేలిముద్ర వేయించుకుని తిరిగి భాస్కర్‌కి ఇవ్వటం.. ఆ కాగితం సత్యం మేనేజరు గారికి ఇవ్వటం.. ఇలా రుణాల కోసం అర్జీలు పెట్టుకునే గడువు ముగిసేదాకా సాగింది. సత్యం కూడా అన్ని దరఖాస్తుల సంఖ్యలు వరుస క్రమంలో తన రహస్య పుస్తకంలో రాస్తూ వచ్చాడు.

కొన్ని రోజుల తరువాత అర్హులైన రైతులకు రుణాలు మంజూరు చేస్తూ జాబితా విడుదల చేసి బ్యాంకు నోటీసు బోర్డులో ఆ జాబితా అతికించారు. ఆ రోజు సాయంత్రం బ్యాంకు మూసేసి వెళ్ళేటప్పుడు సత్యం యథాలాపంగా చూసినట్లు నటిస్తూ తన జేబులోంచి ఒక కాగితం తీసి అందులో ఉన్న దరఖాస్తు సంఖ్యలని అక్కడ అతికించిన జాబితాలో ఉన్న సంఖ్యలతో పోల్చి చూస్తే విచిత్రంగా ఒక రెండు తప్పిస్తే మిగిలిన అన్నీ అవే సంఖ్యలు.

ఇదంతా చూస్తుంటే ఈ భాస్కర్, ఆ మోతుబరి రైతులు కుమ్మక్కై పేద రైతులతో సంతకాలు పెట్టించుకున్న దరఖాస్తులన్నింటికీ ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున రుణాలు మంజూరు చేయబడినట్లుగా తెలుస్తోంది.

మేనేజరు గారికి చెప్దామా అనే ఆలోచన వచ్చింది.. 'కానీ నువ్వు చెప్పేది నిజమే అని నమ్మకమేమిటి' అని ఆయన ప్రశ్నిస్తే నిరూపించటానికి నా దగ్గర బలమైన సాక్ష్యాలేమీ లేవు. అయినా మేనేజరు గారికి తెలియకుండా ఇదంతా జరిగే అవకాశమే లేదు. అంటే ఆయనకి కూడా ఇందులో భాగం ఉందా!! అని ఆలోచిస్తుంటే జ్ఞాపకం వచ్చింది. ఆ మధ్య తరచూ బ్యాంకు సమయం అయిపోయిన తరువాత కూడా భాస్కర్ మేనేజరు గారు కలిసి ఆయన క్యాబిన్‌లో మాట్లాడుకుంటూ ఉండటం తనని ఇంటికి వెళ్ళిపొమ్మనడం!!

అసలే కోతి అందులో కల్లు తాగింది మరి చిందులేయొద్దంటే ఎలా అన్నట్లు... అసలే నిజాయితీపరుడు కళ్ళెదురుకుండా అవినీతి జరుగుతోందని గట్టి నమ్మకం మరి ఏమీ చేయకుండా చూస్తూ ఊరుకోవడమంటే ఎలా....

ఇది సత్యం బాధ ఇప్పుడు.

సరైన సమయం కోసం ఎదురు చూడసాగాడు. ఒక సెలవు రోజున సాయంకాలం ఊరవతల ఉన్న దేవాలయానికి వెళ్ళి వద్దామని బయలుదేరాడు. ఆలయానికి వెళ్ళేటప్పటికి చిరు చీకట్లు కమ్ముకుంటున్నాయి. జనం పెద్దగా లేరు. ప్రదక్షిణలు చేస్తుండగా దేవాలయం వెనుక గుమ్మం ప్రహరీ అవతలి నుంచి ఏవో మాటలు వినిపిస్తుంటే ఎవరా అని చూడటానికి వెళ్ళాడు. అక్కడ సుమారు ఆరుగురు మనుషులు లాంతర్ల వెలుగులో పేకాట ఆడుతున్నారు. అందరి ముందూ డబ్బులు పెట్టి ఉన్నాయి. అంతేగాక వాళ్ళ ముఖాలన్నీ వెలుగుకి దగ్గరగా ఉండటంతో ఒక మోస్తరు స్పష్టంగానే కనిపించాయి సత్యానికి. వాళ్ళలో ఆ మధ్య బ్యాంకులో రుణాలు తీసుకున్న పేద రైతులు నలుగురు ఉన్నారు.

ఒక పక్క పొలానికి పెట్టడానికి డబ్బులు లేవని రుణాలు తీసుకుంటూ ఇంకో పక్క పేకాట ఆడటానికి వీళ్ళ దగ్గిర డబ్బులు ఎక్కడ నుంచి వచ్చాయి.. ఇదేదో తనకి పనికి వచ్చే వ్యవహారంలానే ఉంది అనుకుంటూ వాళ్ళ దగ్గరికి వెళ్ళాడు.

'ఏం రామయ్య బాగున్నావా!' అంటూ అందులో ఒకడిని పలకరించాడు.

ఆటలో నిమగ్నమై ఉన్న వాళ్ళందరూ ఒక్కసారిగా ఉలిక్కిపడి తలలెత్తి చూశారు. గబగబా పేకలు వదిలేసి పరుగు లంకించుకున్నారు. ఇది ముందే ఊహించిన సత్యం ఆ రామయ్య అనేవాడిని పారిపోకుండా గబుక్కున చొక్కా పట్టుకుని దొరకబుచ్చుకున్నాడు. రామయ్య కూడా సత్యాన్ని గుర్తుపట్టాడు.

"పొలం కోసం రుణం తీసుకుని ఆ డబ్బులు ఇలా వృథా చేస్తున్నావా? నిజం చెప్పకపోతే పేకాట ఆడుతున్నావని చెప్పి పోలీసులకి పట్టిస్తాను." అని బెదిరించేటప్పటికి రామయ్య భయపడి సత్యానికి నిజం చెప్పేశాడు.

"మేమేం చేయగలం బాబూ మా పొలాల పట్టాలన్నీ ఆ పెద్దోళ్ళ దగ్గిరే తాకట్టులో ఉన్నాయండి. అవే ఆళ్ళు మళ్ళీ బ్యాంకులో కుదవ పెట్టి రుణాలు తీసుకుంటారు బాబూ. అందుకు మా ఏలి ముద్రలు కావాలి. కాబట్టి మాకు కొంత డబ్బులు ఇచ్చి మిగిలిన సొమ్మంతా ఆళ్ళు తీసేసుకుంటారండీ! ఇలా ఎప్పటి నుంచో జరుగుతున్నాదండి. మీరు కొత్తోరు. అందుకే మీకు తెలవదేమోనండి ఈ సంగతి." అంటూ చెప్పి సత్యం ఏమరపాటుగా ఉండటం గమనించి అతని పట్టు నుంచి చొక్కా వదుల్చుకుని తుర్రుమని పారిపోయాడు. అంతా విన్న సత్యం విభ్రాంతికి గురయ్యాడు. ఎందుకన్నా మంచిదని రామయ్య మాట్లాడుతుండగానే తన సెల్‌ఫోన్‌లో రికార్డు చేశాడు.

'ఇప్పుడేం చేయాలి ఎవరితో చెప్పాలి...చెప్పినా నా మాట ఎవరు నమ్ముతారు.' అని పరిపరి విధాలా ఆలోచిస్తూ ఇంటికి వచ్చాడు.

ఆ మర్నాడే ఒంట్లో బాగోలేదని ఒక వారం రోజులు బ్యాంకుకి సెలవు పెట్టాడు. జరిగినదంతా తన దగ్గర ఉన్న ఆధారాలతో సహా ఒక ఉత్తరంలో రాసి పట్నంలో ఉన్న తన స్నేహితుడు సూర్యకి ఇచ్చాడు. వెంటనే సూర్య, సత్యం కలిసి పాత్రికేయుడైన సూర్య అన్నగారి దగ్గరకు వెళ్ళి ఆ ఉత్తరం చూపించారు.

ఈ వ్యవహారమంతా ఆ మర్నాడే ఆ పత్రిక మొదటి పేజీలో పెద్దక్షరాలతో ముద్రించబడింది. నిప్పు లేనిదే పొగ రాదని ఆ సదరు బ్యాంకు వారికి ఇది పరువు, ప్రతిష్ఠలతో కూడుకున్న వ్యవహారం కాబట్టి వెంటనే విచారణకి ఆదేశించారు. రామయ్యని పట్టుకుని బెదిరించేటప్పటికి వాడు భయంతో అసలు విషయం బయటపెట్టడమే కాక సత్యం రికార్డ్ చేసిన మాటలు తనవేనని ఒప్పుకున్నాడు కూడా.

తీగ లాగితే డొంకంతా కదిలింది. భాస్కర్ మేనేజరు గారితో సహా ఈ రుణ మాఫియా వ్యవహారంలో ఉన్నవారందరి భాగోతాలు వెలుగులోకి వచ్చాయి. కోట్లాది రూపాయలు ఈ రుణాల రూపంలో స్వాహా చేయబడుతున్నట్లు ఆ డబ్బంతా పట్నంలోని పెద్ద పేకాట క్లబ్బులకి తరలి వెళుతున్నట్లు విచారణలో బయట పడింది.

తుంటి కొడితే పళ్ళు రాలినట్లు....బ్యాంకులోని దొంగల్ని పట్టుకుందామని వెళితే పేకాట క్లబ్బుల అక్రమాలు బయటపడ్డాయి. దాంతో లైసెన్సు లేకుండా నడుస్తున్న పేకాట క్లబ్బులు మూతపడటమే కాకుండా వాటిని నడిపిస్తున్న పెద్ద మనుషులు అదుపులోకి తీసుకోబడ్డారు. ప్రస్తుతం కోర్టులో కేసులు నడుస్తున్నాయి. ఈ వ్యవహారానికి అత్యంత ప్రాధాన్యమిచ్చి నేరస్థులకు త్వరితగతిన కఠినమైన శిక్ష పడేలా చూడవలసినదిగా ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ చేయబడ్డాయి.

ఈ వ్యవహారమంతా అసలు బయటకు ఎలా వచ్చింది దీనికంతటికి కారణం ఎవరు అనేది మాత్రం గోప్యంగానే ఉండిపోయింది. ఈ హడావిడిలో సత్యం ఏమయ్యాడో అనే విషయాన్ని ఎవరు పెద్దగా పట్టించుకోలేదు. సెలవులు పూర్తవటంతో సత్యం తిరిగి యథా ప్రకారం బ్యాంకుకి వచ్చాడు. బ్యాంకులో అందరూ ఈ విషయం గురించే మాట్లాడుకుంటుంటే తాను కూడా వాళ్ళలో చేరిపోయి ఏమి ఎరగనట్లే అవునా ఇంత పెద్ద ఎత్తులో రుణ మాఫియా జరిగిందా... అంటూ ఆశ్చర్యం నటించాడు సత్యం. ✦

శరణార్థులు @ వై-ఫై

సిరియా శరణార్థుల విషాద గాథలకు విరామం రావడం లేదు. లక్షలాది మంది తమ పిల్లల ప్రాణాల్ని మిగుల్చుకోవడం కోసం, ఏదైనా భవిష్యత్తు మిగిలుందేమోనని వేలాది మైళ్ల వలస కాలి బాట పట్టారు. ఈ లక్షల బతుకు మజిలీలు కోట్లాది హృదయాల్ని కదిలించివేశాయి. కొందరు పడవ నుంచి ఒడ్డుకు చేర్చారు. కొందరు ఉప్పు నీటి కన్నీటి చారల దేహాల గొంతు తడిపారు. మాడిపోయిన కడుపుకింత ముద్ద పెట్టారు. అయినా చానా జీవితాలు దారెంట ఖర్చయిపోయాయి. ప్రాణ బంధాలు దోవంతటా తెగిపోయాయి. ఆచూకీ లేని ప్రాణాలు, విడిపోయిన మనసులు, చెదిరిపోయిన కుటుంబాలు, కంపించిపోయిన చిన్నారి హృదయాలు ఇంకా భారీగానే కంచె దాటే యత్నంలో కోసుకుపోతున్నాయి. ఈ చేజారిన బంధాల్నే కలిపే ప్రయత్నం చేస్తున్నాడు గ్రీస్‌కి చెందిన పాపడోపోలస్. తమ ప్రాంతంలోని ఇడోమెని గ్రామంలో తలదాచుకుంటున్న సిరియా, ఇరాక్ శరణార్థుల జీవితాల్ని దగ్గరగా చూసేందుకు ఆయన వెళ్లాడు. కదిలించిన ప్రతి కుటుంబంలో ఓ మిస్సింగ్. యుద్ధం అన్ని అవకాశాల్ని తుడిచిపెట్టేసింది. సరిహద్దు దాటగానే వారి నెట్‌వర్క్ కట్ అయిపోయింది. పాపడోపోలస్ పరిష్కారించాల్సిన, పరిష్కరించగలిగిన సమస్య ఇదేనని అర్థమైంది. ఎందుకంటే తానో నెట్‌వర్క్ ఇంజినీర్. అక్కడున్న వేలాది శరణార్థుల వద్ద స్మార్ట్‌ఫోన్‌లున్నాయని గమనించాడు. కానీ సిమ్‌కార్డులు, ఇంటర్నెట్ యాక్సెస్ లేకపోవడంతో అవి ఎందుకు పనికిరాని వాటిలా మిగిలాయి. వెంటనే ఓ ఐడియా తట్టింది అతడికి. నవంబర్ నాటికి శరణార్థి శిబిరంలో ఒక ఉచిత వైఫై స్టేషను ఓ ఖాళీ ట్రైలర్‌లో ఏర్పాటు చేశాడు. సౌర ఫలకాల బ్యాటరీలని అమర్చాడు. సొంత టెక్నాలజీని అభివృద్ధి చేసి మొబైల్ ఫోన్‌లు ఆ దేశపు నెట్‌వర్క్‌ను అందుకునేలా చేశాడు. ఇప్పటి వరకు ఆ స్థానిక గ్రామస్తులకు ఇలాంటి సదుపాయాల గురించి తెలీదు కూడా! ఎనిమిది యాక్సెస్ పాయింట్స్ నుంచి వీరికి వైఫైని అందించేవాడు. ఒక్కో యాక్సెస్ పాయింట్ నుంచి కేవలం 120 మంది మాత్రమే వైఫైని వాడుకోగలరు. కానీ శిబిరంలో 15000 మంది ఉన్నారు. సర్వర్ సామర్థ్యం సరిపోయేది కాదు. చాలా మంది పగటి పూట వైఫైని వాడటంతో ఈ పరిస్థితులు తలెత్తేవి. కొన్ని రోజులకు కొందరు అర్ధరాత్రులు మేల్కొని తమ కుటుంబ సభ్యులకు కనెక్ట్ అయ్యే పనిలో పడేవారు. ఇలా తొలి రోజుల్లో కొంత కష్టపడ్డా చివరికి ఆ శిబిరంలో ఉన్న చాలా మంది శరణార్థులకి ఈ వైఫై వల్ల విడిపోయినవారి వివరాలు, వారి మంచి చెడుల సమాచారం అంతర్జాలం ద్వారా సామాజిక మాధ్యమాల ద్వారా ఇతరత్రా స్వచ్ఛంద సంస్థల నెట్‌వర్క్‌ల ద్వారా తెలుసుకోగలిగారు. తన చిన్న ప్రయత్నం చాలా మంది కళ్లల్లో ఆశల్ని చివురింపజేసిందని గమనించిన పాపడోపోలస్ మరింత ఉత్సాహంగా తన కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాడు. మరిన్ని వైఫై స్టేషన్లను ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యాడు. ఎవరైనా సాయం అందిస్తే మరిన్ని శరణార్థి శిబిరాల్లోని వారిని వైఫైతో కనెక్ట్ చేస్తానని అంటున్నాడు. ✦



ఉగాది పచ్చడి

కావాల్సిన పదార్థాలు

పచ్చి మామిడి ముక్కలు - 4 టేబుల్ స్పూన్లు
వేప పువ్వు - 1 టేబుల్ స్పూన్
నీరు - 1 1/2 కప్పు
బెల్లం- 3 టేబుల్ స్పూన్లు
ఎండు కారం పొడి- 1 టేబుల్ స్పూన్
చింత పండు గుజ్జు- 2 టేబుల్ స్పూన్లు
ఉప్పు- తగినంత

తయారుచేసే విధానం

ముందుగా చింత పండును అర కప్పు నీటిలో నానబెట్టాలి. వేప పువ్వును వలిచి పక్కన పెట్టుకోవాలి. మామిడి కాయలను చిన్న సన్న ముక్కలుగా తరగాలి. బెల్లాన్ని చిన్న ముక్కలుగా లేదా పొడి చేసి ఒక ప్లేట్‌లో పెట్టుకోవాలి. ఇప్పుడు నానబెట్టిన చింత పండును గుజ్జుగా చేసి ఒక బౌల్‌లోకి తీసుకోవాలి. అందులో తరిగిన మామిడి ముక్కలు, బెల్లం వేసి బాగా కలుపుకోవాలి. తర్వాత కారం, ఉప్పు, వేప పువ్వు వేసి మరోసారి కలిపితే రుచులొలికే ఉగాది పచ్చడి రెడీ! ఈ మిశ్రమంలో అరటి పండు, కొబ్బరి ముక్కల్ని, పుటాల పప్పును కూడా అదనంగా చేర్చవచ్చు.

రుచి

పెసర పప్పు పాయసం

కావాల్సిన పదార్థాలు

పాలు - 1 1/2 లీటర్లు
పెసర పప్పు - 2 కప్పులు
బెల్లం - 1 కప్పు
యాలకుల పొడి - 1 టేబుల్ స్పూన్
జీడిపప్పు - 2 టేబుల్ స్పూన్లు
కిస్‌మిస్ - 1 టేబుల్ సూన్
నెయ్యి - 1 టేబుల్ స్పూన్

తయారుచేసే విధానం

ముందుగా స్టౌపై పాన్ పెట్టి వేడెక్కిన తర్వాత నెయ్యి, జీడిపప్పు, కిస్‌మిస్‌లను వేసి బంగారు రంగు వచ్చే వరకు వేయించి పక్కన పెట్టుకోవాలి. అదే పాన్‌లో పెసర పప్పు వేసి ఐదు నిమిషాల పాటు వేయించాలి. ఇప్పుడు పెసర పప్పును ఉడక పెట్టి పక్కన పెట్టుకోవాలి. మందపాటి పాత్రలో కప్పు నీరు పోసి అందులో బెల్లాన్ని వేసి కరిగే వరకు మరగనిచ్చి పాకాన్ని పక్కన పెట్టుకోవాలి. మరో పాత్రలో పాలు పోసి బాగా మరగనివ్వాలి. అందులో ఉడకబెట్టిన పెసరపప్పును చేర్చి బాగా కలపాలి. బెల్లం పాకాన్ని అందులో వేసి చిన్న మంటపై పదిహేను నిమిషాల పాటు ఉడకనివ్వాలి. తర్వాత స్టౌ ఆపేసి అందులో యాలకుల పొడి, వేయించిన జీడిపప్పు, కిస్‌మిస్‌లను వేసి అతిథులకు సర్వ్ చేయండి.



మామిడి పులిహోర

కావాల్సిన పదార్థాలు

మామిడి తురుము - 2 కప్పులు
వేయించిన పల్లీలు - 5 టేబుల్ స్పూన్లు
జీడి పప్పు - 2 టేబుల్ స్పూన్లు
ఉడికించిన అన్నం - 3 కప్పులు
ఆవాలు - 1 టేబుల్ స్పూన్
శెనగ పప్పు -1 టేబుల్ స్పూన్
మినప పప్పు -1 టేబుల్ స్పూన్
ఎండు మిరపకాయలు - 4
పచ్చి మిర్చి - 6
అల్లం ముక్కలు (సన్నగా తరిగినవి) -1 టీ స్పూన్
ఇంగువ - 1/4 టీ స్పూన్
పసుపు - 1/2 టీ స్పూన్
కరివేపాకు - 20 రెమ్మలు

తయారుచేసే విధానం

స్టౌపై మందపాటి గిన్నె పెట్టి నూనె వేసి వేడి చేయాలి. అందులో ఆవాలు, శెనగ పప్పు, మినప పప్పు వేసి బంగారు రంగు వచ్చే వరకు వేగనివ్వాలి. తర్వాత పచ్చి మిర్చి, ఎండు మిర్చి, అల్లం, కరివేపాకు, పసుపు, ఇంగువ వేసి కొద్ది నిమిషాలు వేగనివ్వాలి. తర్వాత మామిడి తురుము, వేయించిన పల్లీలను వేసి మరికొంతసేపు వేయించి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఒక వెడల్పాటి ప్లేట్ తీసుకుని ఉడికించి పెట్టుకున్న అన్నాన్ని అందులో పరిచినట్టు ఉంచాలి. అందులో తగినంత ఉప్పు చల్లి మామిడి మిశ్రమాన్ని అందులో వేసి బాగా కలుపుకోవాలి. అంతే పుల్ల పుల్లటి మామిడి పులిహోర రెడీ! దీన్ని వడియాలతో గాని తియ్యటి పచ్చడితో గాని తీసుకుంటే రుచిగా ఉంటుంది.



రంగులు అద్దండి



ఆకులతో బొమ్మ

మనింటి ముందు చెట్ల నుంచి రాలి పడుతుండే పచ్చి ఆకులు, ఎండుటాకులతో మేక బొమ్మ ఎలా చేయచ్చో ఇక్కడ ఇచ్చాం! దాన్ని గమనించి మీరూ తయారు చేసేయండే!

భిన్నమైనదేది ?

ఇక్కడున్న జీబ్రా పిల్లల్లో ఒకటి భిన్నంగా ఉంది. అదెక్కడుందో కనిపెట్టండి.



అతికిద్దాం

చింటూకి ఈ మధ్య అల్లరి మరీ ఎక్కువైపోయింది. యాంగ్రీ బర్డ్ బొమ్మను కత్తిరించి అతికించకుండా వెళ్లిపోయాడు. ఇక్కడిచ్చిన బొమ్మ ఆధారంగా మీరు దాన్ని జాగ్రత్తగా అతికించేయండి.





నీడను గుర్తించండి

చింటూ వాళ్ల ఇంట్లో బోలెడు పెంపుడు జంతువులన్నాయి. అయితే వాటి నీడను గుర్తించండి.

కనిపెట్టండి

బన్నీ వాళ్ల బీరువాలో బట్టలే కాకుండా చాలా ఇంటి సామాన్లను దాచిపెట్టాడు. పక్కనున్న బొమ్మల ఆధారంగా అవెక్కడున్నాయో కనుక్కోండి. గుర్తించండి.

మెరిసే రంగుల ఈకలతో కనిపించే చైనీస్ ఫీసెంట్ పక్షులపై ఎక్కువగా బంగారు రంగే కనిపిస్తుంది. అందుకే వీటిని బంగారు నెమలి అంటారు. చైనాలోని అడవులు, కొండ ప్రాంతాలు వీటి నివాస ప్రదేశాలు. అచ్చు పెయింటింగుల్లో గీసే బొమ్మల్లా ఇవి ఎంతో అందంగా ఉంటాయి. వీటిని నేరుగా చూస్తే అసలవి నిజంగానే ఉన్నాయా అన్నంత అద్భుతంగా కనిపిస్తాయి. వీటిలో వివిధ రకాల పక్షులున్నాయి. రెడ్ గోల్డెన్ రకం పక్షి ఎక్కువగా దట్టమైన అడవుల్లో నివసిస్తుంది.

బంగారు నెమలి

- కెనడా, అమెరికా, మెక్సికో, కొలంబియా, పెరూ, బొలీవియా, చిలీ, ఉరుగ్వే, జర్మనీ, బెల్జియం, ఫ్రాన్స్, ఆస్ట్రేలియాలోనూ ఇవి కనిపిస్తాయి.
- మగ పక్షులు 90 నుండి 105 సె.మీ. పొడవున వుంటాయి.
- వీటి తోక మాత్రం వాటి మొత్తం పొడవులో 2/3 వంతు ఉంటుంది.
- శరీరం ముదురు ఎరుపు రంగులోనూ ఛాతి భాగం బంగారు రంగులో పొరలు పొరలుగా ఉంటుంది. మిగతా భాగం పసుపురంగు కలిగి ఉంటుంది.
- తల భాగం కాషాయ రంగులో ఉంటుంది.
- వీటి కళ్ల చుట్టూ ఉండే ఎరుపు, బంగారు రంగు వలయాలు వీటి ప్రత్యేక ఆకర్షణ.
- ముఖం, గొంతు, గడ్డం వద్ద వుండే పొరల్లో బంకగా వుంటుంది.
- ఒక్కో శరీర భాగం ఒక్కో రంగులో ఉండే ఈ పక్షులు తమ అందంతో చూపరులను కళ్లు తిప్పుకోనీకుండా చేస్తాయి.
- ఆడ పక్షులు మగ పక్షుల కంటే తక్కువ ఛాయలో వుంటాయి.
- ఇవి రాత్రి పూట మాత్రం చెట్ల పైనే ఉంటాయి. ఈ పక్షులు ఎగరగలిగినా పరిగెత్తడమంటే వీటికి భలే ఇష్టం!
- ఆడపక్షులు ఎక్కువగా ఎండాకాలంలో 8-12 గుడ్లు పెడుతుంటాయి.

పదవికాసం – 9

కూర్పు: టి.డి. ప్రసాద్

1	2		✿	3			✿	4	5
6		✿	7		✿	8	9		
	✿	10		✿	11			✿	✿
✿	12	✿	13	14	✿	15		16	17
18	✿	19	✿	20	21	✿	✿	22	
23	24		25	✿	26	27		✿	
28		✿	29	30			✿	31	
✿	✿	32			✿	✿	33		
34	35		✿	36	37	38			✿
39		✿	40	✿	41			✿	42

ఆధారాలు

అడ్డం

1. పండ్లు, ప్రయోజనాలు (3)
3. గరళమే.. చివర్లో లేదు (2)
4. ఈ చెట్టంతా చేదే (2)
6. ఆంగ్లలో నీ (2)
7. పట్టణం (2)
8. కవిత్వం చెప్పే మహిళ (4)
10. బాహువు (2)
11. కడ, తుద (3)
12. ఉష:కాలంలో పండుగ మొదలు (1)
13. తన పేరులో మూడును ఇముడ్చుకున్న హీరోయిన్ (2)
15. నెలరేడు (4)
20. వస్త్రాముకు వ్యతిరేకం (2)
22. చివర వరకు లేని సంహారం (2)
23. తిమిని మింగే భారీ చేప (4)
26. ధనాగారం (3)
28. కాలువ, అతిగా మాట్లాడటం (2)
29. కొంగలు (4)
31. తిరగబడిన స్థానం (2)
32. రాములమ్మ చివర్లో దాగుంది (3)
33. పాపకూపమునందు 1,2,6 (3)
34. వంద పద్యాలు గల --- శతకం (3)
36. మోసం (5)
39. మధ్యలో మ చేర్చితే కమలం (2)
40. వడగాడ్పుల్లో ఇది మూడోది (1)
41. సంభాషించేటపుడు నోటి నుంచి వచ్చేవి (3)
42. అడ్డం 12, 40తో కలిపి తెలుగు సంవత్సరాది (1)

నిలువు

1. బైరాగి, భిక్షకుడు (3)
2. బీహార్ మాజీ సీఎం -- ప్రసాద్ యాదవ్ (2)
3. కాపలా (2)
4. వంద పదులు (2)
5. పత్రికలు చివర్లో లేవు (2)
7. మేళం, మేళగాడు (3)
8. తొడుగు (3)
9. వెల్లువ, ప్రవాహం (3)
14. అనుబంధం (2)
16. నెల (2)
17. శ్రీశ్రీ ప్రముఖ రచన (5)
18. ఇంతీ, వనితా (3)
19. ముక్కుతో మాట్లాడితే ఇలా అంటారు (2)
21. మోము (3)
24. మింగమని చెప్పండి (2)
25. నిలువుగా వేలాడు (3)
27. మధ్యలో జు లేని జాజులు (2)
30. పిలక పైకే (3)
31. కింది నుంచే కంపనం (3)
32. జాలితో కరగని గుండెను ఇలా అంటారు (3)
33. గీతాలు (3)
34. సుతుని పిలవండి (2)
35. యంత్రం (2)
37. తమాషా చివర్లో అదృశ్యం (2)
38. చివర్లో తెగిన లాటరీ (2)

సుడోకు

		8	4		9			5
9		2		5	6			
4		5	7		2			6
	8	3		4	5		2	
			1		8			
	5		9	3		8	4	
3			5		1	7		9
			8	9		3		2
8			2		3	6		

గతవారం జవాబులు

4	3	2	8	1	5	6	7	9
9	5	7	6	2	3	8	1	4
8	6	1	4	7	9	3	2	5
2	4	3	1	5	6	7	9	8
1	7	5	3	9	8	2	4	6
6	8	9	2	4	7	5	3	1
3	9	6	7	8	1	4	5	2
5	2	8	9	3	4	1	6	7
7	1	4	5	6	2	9	8	3

1 క	2 ప	టి	✿	3 కా	యం	✿	4 బొం	గ	5 రం
6 దం	డు	✿	7 వే	టు	✿	8 కం	ది	✿	గ
బం	✿	9 జా	గు	✿	10 చూ	చు	✿	11 న	వ
✿	12 అం	డ	✿	13 వీ	లు	✿	14 మా	త	ల్లి
15 లీ	తం	✿	16 వి	పు	✿	17 కా	ను	పు	✿
హో	✿	18 చి	త్తం	✿	19 మే	లు	కో	✿	20 లి
✿	21 ప	త్రం	✿	22 వే	షం	✿	✿	23 పా	పి
24 తే	ది	✿	25 రే	యి	✿	26 జ	27 న	వ	రి
యా	✿	28 చే	వ	✿	29 బ	త	డు	డ	✿
30 కు	ల	ప	తి	✿	31 కం	గా	రు	✿	32 పై



కళను పెదాలకద్ది

పెదాలకు రంగు పూసుకోవడం వేరు.. పెదాలకు కళను అద్దడం వేరు. అదే చేస్తోంది కెనడాకు చెందిన మేకప్ ఆర్టిస్ట్ ఆండ్రియా రీడ్. కట్సుషికా హోకుసాయ్ అద్భుతం.. తైల చిత్రం 'గ్రేట్ వేవ్ ఆఫ్ కనగావా'ను అధరాలపైకి తర్జుమా చేసేసింది. పూరేకుల్లా, తేనె తుట్టెల్లా ఇలా అందాన్నద్ది మరింత తీపి చేసింది. గర్ల్ గ్రే బ్యూటీ పేరుతో ఇలా అదరహో అధరాల కళను రంగరించేస్తోంది. ఈ చిత్రాల్ని చూస్తుంటే ఒకే వన్నెతో ఉండే లిప్ స్టిక్ బోర్ కొట్టేస్తుందేమో.









You have Problems?
I have Solutions !
నేనున్నాను !

సమస్యలతో రండి! సక్సెస్‌తో దూసుకుపొండి...



నత్తి, డిప్రెషన్, గుండెదడ, నరాల బలహీనత, భయం, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ప్రేమ వైఫల్యం, మద్యం, సిగరెట్లు, ఖైనీ, ఆత్మవిశ్వాసం లోపించడం, మరియు అనేక సమస్యలకు ఎంతో మంది నా వద్దకు వచ్చి హిప్నో-సైకోథెరపీ ద్వారా పరిష్కరించుకున్నారు. సక్సెస్ అయ్యారు, ఇక మీ వంతు, మీకు సమస్యలున్నా సక్సెస్ కావాలన్నా భవిష్యత్‌లో స్థిరపడాలన్నా...

Contact for Corporate Programs
Cell: 98481 90302

క్రాంతికార్

నేనున్నాను !

(Psychologist , Hypno-Therapist & HRD trainer)(PhD),MSc(Psychology), MSc(Counseling Psychology), MSc(App Psy), MA (Child Care),BSc(Psy), BA(Psy),BNat (Naturopathy & Yoga),DY(Yoga),YCC(Yoga),MBA(HR),MA(PPM), MA(S), MA(PPS), MLM,MA(GT), MA(Phy), BCom,HDSE & More

www.krantikar.com
www.vidhatha.in



VIP Vidhatha Institute of Personality Developmnet

33ఏళ్ళ అనుభవంతో **వ్యక్తిత్వ వికాసం**

రియల్ ఎస్టేట్, ఇన్సూరెన్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్‌కు నెట్‌వర్క్ మార్కెటింగ్ ప్రతినిధులకు షాపింగ్‌మాల్స్, హాస్పటల్ సిబ్బందికి స్కూల్స్, ఇంజనీరింగ్, మేనేజమెంట్ కాలేజిలకు, ప్రత్యేక శిక్షణ కై సంప్రదించండి

6,000 పవర్ పాయింట్ ప్రదర్శనలు మా వద్ద రెడిగా కలవు

Contact for Corporate Programs
Cell: 98481 90302

డా|| క్రాంతికార్

(Psychologist , Hypno-Therapist & HRD trainer) (PhD),MSc(Psychology),MSc(Counseling Psychology), MSc(App Psy), MA (Child Care),BSc(Psy),BA(Psy),BNat (Naturopathy & Yoga), DY(Yoga),YCC(Yoga),MBA(HR),MA(PPM), MA(S), MA(PPS), MLM,MA(GT), MA(Phy), BCom,HDSE & More

ప్రముఖ సైకాలజిస్ట్

websites : www.krantikar.blogspot.in
www.vidhatha.in, www.kranthikar.com
www,facebook.com/krantikar ye
Hyderabad : 93 93 11 2021, Vizag : 9440 633 610

Check List

Book Number	KNSR02B115	Date	03/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mouni	Cutting By	Mouni
Scanned By	Shameena	Pages	29